

Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 12.04.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 45 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com








• హమ్మయ్యా...

# పోలింగ్ ముగిసింది రూలింగ్ మిగిలింది

- ➤ ఓటెత్తిన చైతన్యం ➤ భారీగా తరలివచ్చిన జనం
- ➤ ముగిసిన ఎలక్షన్ ➤ ఇక 42 రోజుల టెన్షన్
- ➤ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిగా జరిగిన సమరం



2లో














# పోలింగ్ ముగిసింది.. రూలింగ్ మిగిలింది

నరాలు తెగే ఉత్కంఠ... చావో రేవో తేల్చుకునే తరుణం. రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీల మధ్య హోరాహోరీ సమరం... ఇద్దరు ప్రధాన నాయకులకు ఫైనల్ మ్యాచ్‌లాంటి పరిస్థితి. గెలిచిన వాళ్ళు ఫీల్డ్‌లో నిలబడడం... ఓడిన వాళ్ళు తెరమరుగవడం... కళ్ళ ముందు ఈ స్థితి... నెల రోజులుగా ఎత్తులు... పైఎత్తులు... వ్యూహాలు, ప్రతి వ్యూహాలు... అలుపులేకుండా ప్రచార సభలు.. ఓటర్లపై విచ్చలవిడిగా వరాలు... ప్రభుత్వ సొమ్మునే పథకాల పేర్లతో ఓట్ల కొనుగోలుకు ఖర్చు చేయడం... అన్నింటికీ మించి ప్రజాపక్షం వహించాల్సిన మీడియా ఆయా పార్టీల ప్రచార సాధనాలుగా మారడం... అబ్బా ఒకటా... రెండా... ఈ ఎన్నికల్లో ఎన్ని వింతలు చూడాలో... అన్నీ చూశాం! రాజకీయాలు ఏ స్థాయికి దిగజారిపోయాయో చూశాం..! విలువలకు సమాధి కట్టడం, డబ్బు, మద్యంకు పట్టం కట్టడం చూశాం... అనైతిక పొత్తులు చూశాం... వెన్నుపోట్లు చూశాం... అబద్దాల హామీలు చూశాం... ఇప్పుడు అందరూ కోరుకునేది ఒక్కటే... ఇట్లాంటి ఎలక్షన్‌లు ఇక రాకూడదు. అంత దరిద్రంగా మారాయి ఎన్నికలు. రాజకీయ నాయకులంటే జనానికి అసహ్యం పుట్టాలి. కాని రాజకీయ నాయకులకే అసహ్యం పుట్టేలా మారిపోయాయి ఎన్నికలు.



- ఓటెత్తిన చైతన్యం
- భారీగా తరలివచ్చిన జనం
- ముగిసిన ఎలక్షన్
- ఇక 42 రోజుల టెన్షన్
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిగా జరిగిన సమరం










ఓటు హక్కు వినియోగించుకున్న వై.యస్.విజయమ్మ, షర్మిల, భారతిరెడ్డి

ఏదైతేనేం... అటు అధికార తెలుగుదేశంకు ఇటు ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఫైనల్ మ్యాచ్‌గా మారిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలు, అలాగే 25లోక్‌సభ స్థానాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికలు అయిపోవడంతో ఒక యుద్ధం ముగిసినట్లయ్యింది. ప్రత్యక్ష యుద్ధాలలో అయితే విజేత ఎవరో, పరాజితులెవరో అక్కడే తేలిపోతుంది. కాని, ఇది ఎన్నికల యుద్ధం కాబట్టి ఈవిఎంలు తెరిచేదాకా విజేతల కోసం ఎదురుచూడక తప్పదు. రాష్ట్ర ప్రజల తీర్పు ఈవిఎంలలోకి వెళ్లిపోయింది. మే 23వ తేదీన ఏపి ప్రజలు ఎవరికి పట్టం కట్టారు, ఎవరిని సాగనంపారు అన్నది తేలబోతుంది.

## సమర్ధవంతంగా ఎన్నికల నిర్వహణ

అనేక ఆరోపణలు, ఫిర్యాదుల నడుమ రాష్ట్రంలో ఎన్నికల ఘట్టం సజావుగానే ముగిసిందనుకోవాలి. ఎన్నికలన్నాక చెదురుమదురు సంఘటనలు సహజమే! ఇక ఈ ఎన్నికల్లో పోలింగ్ 75.67 శాతం నమోదు కావడంపైనే విశ్లేషణలు మొదలయ్యాయి. ఈ పోలింగ్ శాతం ఎవరికి అనుకూలంగా వుంటుందన్న దానిపై చర్చలు నడుస్తున్నాయి. ప్రజలలో ప్రభుత్వ వ్యతిరేకత బలంగా వున్నప్పుడు పోలింగ్ శాతం పెరుగుతుంటుంది. ఈసారి ఎన్నికల్లో ఓటును వేయాలనే చైతన్యం ప్రజల్లో బలంగా వచ్చింది. గతంలో ఓటింగ్ పట్ల ఆసక్తి చూపని వాళ్ళు కూడా ఈసారి ఓట్లు వేశారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డ ప్రవాసాంధ్రులు కూడా ఈసారి పెద్ద ఎత్తున తమ స్వగ్రామాలకు వచ్చి ఓట్లు వేయడం ఏ పార్టీకి అనుకూలం కానుందనే విశ్లేషణలు సాగుతున్నాయి. ముఖ్యంగా కొత్తగా ఓటర్లయిన యువత ఈ ఎన్నికల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం మరో విశేషం.

## ఎవరి ధీమా వారిదే!

ఎన్నికల్లో గెలుపుపై అటు తెలుగుదేశం, ఇటు వైసిపిలు ధీమాగానే వున్నాయి. చంద్రబాబు పరిపాలనా అనుభవం, చివర్లో ఇచ్చిన పసుపు – కుంకుమ, అన్నదాత సుఖీభవ డబ్బులు తమను గెలిపిస్తాయని, 90 నుండి 95 సీట్లతో తమదే అధికారమని టీడీపీ నాయకులు ఆత్మవిశ్వాసంతో వున్నారు.

ఇక వైసిపి శ్రేణుల్లో అయితే గెలిచామన్న ధీమానే కనపడుతుంది. 2014 ఎన్నికల్లో పెద్దగా సీట్లు రాని కృష్ణానది ఉత్తరం వైపు ఆరు జిల్లాల్లో మంచి ఫలితాలు వస్తాయని, అలాగే కృష్ణానదికి దక్షిణం వైపు ఏడు జిల్లాల్లో 2014 ఎన్నికల్లో వచ్చిన సీట్లకంటే ఇంకా పెరుగుతాయనే ఆత్మవిశ్వాసం ఆ పార్టీలో కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో జగన్‌కు తోడుగా వై.యస్. విజయమ్మ, షర్మిలలు చేసిన ప్రచారం కూడా ఓటర్లపై ప్రభావం చూపింది. ముఖ్యంగా చంద్రబాబు ఐదేళ్ళ పాలనలోని వైఫల్యాలు, ప్రత్యేకహోదాకు పాడెకట్టడం, అవినీతి అక్రమాలు, టిడిపి నేతల దౌర్జన్యాలు, మైనింగ్ మాఫియా భూ భాగోతాలు... ఇవన్నీ కూడా తెలుగు దేశం ప్రభుత్వంపై వ్యతిరేకత తెచ్చాయని, మాట ఇస్తే నిలబడే నైజం, ప్రత్యేకహోదా విషయంలో చేస్తున్న పోరాటం, బిసి డిక్లరేషన్, ఆయా వర్గాలకు సీట్లలో పెద్దపీట వేయడం... ఇత్యాది కారణాలన్నీ రాష్ట్రంలో మెజార్టీ వర్గాల ప్రజలు జగన్ వైపుకు మొగ్గు చూపడానికి కారణమని, కాబట్టి వైసిపి గెలుపు ఖాయమైపోయిందని ఆ పార్టీ వర్గాలు గట్టిగా విశ్వసిస్తున్నాయి.

ఎన్నికల్లో ఒక దశ మాత్రమే దాటాం. ఇంకా ఆరు విడతల పోలింగ్ జరగాల్సి వుంది. మే 23న ఈవిఎంలు తెరుస్తారు. దేశానికి రాజెవరో ఆరోజే తెలుస్తుంది. దాంతోపాటే ఆంధ్రా కింగ్ ఎవరో కూడా తేలబోతుంది. ఈ 40రోజులు ఇక నాయకులు, జనం టెన్షన్ భరించక తప్పదు.


## అక్కడక్కడా హింస... చెదురుమదురు సంఘటనలు

రాష్ట్రంలో పలు చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. పరస్పరం జరిగిన దాడుల్లో అనంతపురం జిల్లాలో ఒకరు, చిత్తూరు జిల్లాలో ఒకరు వైసిపి కార్యకర్తలు మరణించారు. నర్సారావుపేటలో రిగ్గింగ్‌కు పాల్పడిన స్పీకర్, టిడిపి అభ్యర్థి కోడెల శివప్రసాద్‌ను స్థానిక వైసిపి కార్యకర్తలు పట్టుకుని కొట్టారు. పలుచోట్ల పోటీలో వున్న అభ్యర్థులపై ప్రత్యర్థులు దాడులు చేశారు.

## వరదలై పారిన మద్యం... అడ్డుకట్టలేని నోట్ల ప్రవాహం

రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎప్పుడూ జరగనంతటి ఖరీదైన ఎలక్షన్ ఇప్పుడు జరిగింది. అన్ని పార్టీ అభ్యర్థుల ఖర్చు కలిపితే వేల కోట్లలోనే వున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ ఖర్చు నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల స్థాయిని బట్టి ఓటు రేటు వెయ్యి నుండి పదివేల రూపాయల దాకా పలికింది. పోలీసులు ఎన్ని చెక్‌పోస్టులు పెట్టి ఎంతగా తనిఖీలు చేసినా వీళ్ళు పట్టుకున్నది గోరంత... తరలిపోయింది కొండంతగా వుంది. ఇక మద్యం అయితే ఐఎంఎల్ డిపోలే సప్లై చేయలేనంతగా పరవళ్ళు తొక్కింది.

5వ వర్ధంతి



మానవత్వానికి ప్రతిరూపంలా నిలిచారు, దాతృత్వంతో అందరి మనసులు గెలిచారు,
శ్రమించే తత్వానికి ప్రతిబింబం మీరు... మంచిని పంచే వ్యక్తిత్వానికి పెట్టింది మీ పేరు.
మా ఉన్నతికి బాటలు వేసి, మా బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచిన మా ఇంటి దైవం
కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత: సిపిఆర్ కళ్యాణ మండపం, శివప్రియ లాడ్జి
పరమపదించి 18.04.2019 గురువారం నాటికి ఐదేళ్ళు గడుస్తాయి.
వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ
కుమారుడు - కోడలు: చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి
మనుమలు: హరీశ్వర్‌రెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి
మరియు బంధుమిత్రులు

● నెల్లూరు జిల్లాలో..

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



నెల్లూరుజిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలు, పది అసెంబ్లీ స్థానాలకు 11వ తేదీ గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6గంటలకే ఓటర్లు బూత్‌ల వద్దకు పోటెత్తారు. ఓట్లు వేసేందుకు 'క్యూ'లలో బారులు తీరారు. యువత, మహిళలు, వృద్ధులు ఓటింగ్‌లో అత్యుత్సాహంతో పాల్గొనడం విశేషం. జిల్లా వ్యాప్తంగా 23,92,210మంది ఓటర్లు వుండగా 16,52,510 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11వ తేదీ రాత్రి 8గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 69.08 శాతం పోలింగ్ నమోదు కాగా, సూళ్ళూరుపేట నియోజకవర్గంలో అత్యధికంగా 81.48శాతం, నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అత్యల్పంగా 59 శాతం పోలింగ్ నమోదైంది. పూర్తి పోలింగ్ శాతం ఇంకా తేలాల్సి వుంది. జిల్లాలో పలు చోట్ల ఘర్షణలు జరిగాయి. పోలీసులు వెనువెంటనే పరిస్థితులను అదుపులోకి తెచ్చారు.

జిల్లాలో నెల్లూరు పార్లమెంట్ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా బీద మస్తాన్‌రావు, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా చేవూరు దేవకుమార్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, సీపీఎం అభ్యర్థిగా చంద్ర రాజగోపాల్‌లు బరిలో నిలవగా, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావుల మధ్యే ప్రధాన పోటీ నెలకొనివుంది. అలాగే



ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

తిరుపతి పార్లమెంట్ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పనబాక లక్ష్మి, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా బల్లి దుర్గాప్రసాద్‌లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

జిల్లాలోని నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలోనూ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తమ తమ నియోజకవర్గాలలో భారీగా పోలింగ్ పెరగడంతో గెలుపుపై ఎవరి ధీమాలో వాళ్ళున్నారు.



## దివ్యాంగులకు ప్రత్యేక వసతులు

2019 అసెంబ్లీ మరియు పార్లమెంటు సాధారణ ఎన్నికల సందర్భంగా ఏ ఒక్క ఓటరు కూడా ఓటు వేయకుండా మిగిలిపోకూడదు అనే సదుద్దేశంతో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కును సుగమం చేసేందుకు గాను, 1767 పోలింగ్ లొకేషన్స్ నందు వీల్‌ఛైర్స్, రాంప్స్ మరియు ప్రత్యేక బారికేడ్లు, ఇద్దరు వ్యక్తిగత సహాయకులు మరియు అంధులైన దివ్యాంగులకు ప్రత్యేక బ్రెయిలీ డమ్మి బాలట్, ప్రత్యేక రవాణా సౌకర్యం తదితర సదుపాయాలను మొట్టమొదటిసారిగా ఈ ఎన్నికల్లో కల్పించారు. జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. పలువురు దివ్యాంగులు తమకు ఏర్పాటు చేసిన సదుపాయాల పట్ల ఎంతో సంతృప్తి చెంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.









### ➔ నెల్లూరు నగరం

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఏడుగంటల నుండే పోలింగ్‌బూత్‌లలో ఓటర్లు బారులు తీరారు. ఎండను సైతం లెక్కచేయక ఓటర్లు 'క్యూ'లలో నిలబడ్డారు. కొన్ని చోట్ల ఈవిఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఆర్ఎస్ఆర్ స్కూల్ బూత్‌లో వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌పై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. మిగతా అన్నిచోట్ల పోలింగ్ ప్రశాంతంగా నడిచింది. తెలుగుదేశం అభ్యర్థి పి.నారాయణ, వైసిపి అభ్యర్థి అనిల్‌కుమార్‌లు అన్ని బూత్‌లు కల తిరుగుతూ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

### ➔ నెల్లూరు రూరల్

గ్రామీణ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగానే జరిగింది. రూరల్ గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. నగర పరిధిలోని పోలింగ్‌బూత్‌లలోను ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి గొడవలు లేకుండా పోలింగ్ ముగిసింది.

### ➔ కోవూరు

చిన్నచిన్న గొడవలు తప్పితే మొత్తానికి పోలింగ్ బాగా జరిగింది. గ్రామాలలోని పోలింగ్‌బూత్‌లలో ఓటర్లు మెండుగా కనిపించారు. బయట ప్రాంతాలలో స్థిరపడిన వాళ్ళు సైతం ఈసారి అదిపనిగా వచ్చి నియోజకవర్గంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెలుగుదేశం అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైసిపి అభ్యర్థి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

### ➔ కావలి

పోలింగ్ కంటే ముందే టెన్షన్ వాతావరణం నెలకొన్న నియోజకవర్గమిది. దీంతో పోలీసు అధికారులు ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగానే జరిగింది. వైసిపి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని పర్యవేక్షిస్తూ తిరిగారు.

### ➔ ఉదయగిరి

నియోజకవర్గంలోని 8మండలాలలో పోలింగ్ ఎంతో బాగా జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వలస ఓటర్లు ఈ ఎన్నికలకు నియోజకవర్గానికి భారీఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వైసిపి అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి బొల్లినేని రామారావులు అన్ని మండలాలలో పోలింగ్‌బూత్‌లను పర్యవేక్షించారు.

### ➔ ఆత్మకూరు

వైసిపి అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్యల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. మేకపాటి స్వగ్రామం బ్రాహ్మణక్రాకలో బొల్లినేని శీనయ్య ఏజెంట్‌గా కూర్చోగా వైసిపివాళ్ళు ఆయనను బయటకు పంపించారు. దీంతో బొల్లినేని కృష్ణయ్య స్వయంగా వచ్చి ఆ బూత్‌లో కూర్చోవడంతో వివాదం రేగింది. చేజర్ల మండలం పుళ్ళనీళ్ళపల్లెలో మేకపాటి గౌతంరెడ్డిపై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేశారు.

### ➔ వెంకటగిరి

పోలింగ్ ముమ్మరంగా జరిగింది. ఇరు పార్టీల అభ్యర్థులు కూడా వెంకటగిరి పట్టణంలో మెజార్టీ సాధించడంపై దృష్టి పెట్టారు. ఓటింగ్ ప్రక్రియ మొదలయ్యే గంట వరకు కూడా ఇరు పార్టీల అభ్యర్థుల ఓట్ల వేట సాగింది. వైసిపి అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణల మధ్య హోరాహోరీ పోరు నడిచింది.

### ➔ గూడూరు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈవిఎంలు అక్కడక్కడా ఇబ్బంది పెట్టాయి. ఎక్కడా గొడవలు లేవు. వైసిపి అభ్యర్థి వరప్రసాద్, టిడిపి అభ్యర్థి పాశం సునీల్‌లు పోలింగ్‌ను పర్యవేక్షించారు.

### ➔ సూళ్ళూరుపేట

ఏ గొడవలు లేకుండా ఎన్నికలు జరిగాయి. ఓటర్లు భారీ ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. వైసిపి అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, టిడిపి అభ్యర్థి పరసా రత్నంలు పోలింగ్‌బూత్‌లను సందర్శిస్తూ ఎప్పటికప్పుడు పోలింగ్‌ను పర్యవేక్షించారు. టీడీపీ పెద్దగా పోటీలో లేకపోవడంతో ఓటింగ్ ఏకపక్షంగా నడిచింది.

### ➔ సర్వేపల్లి

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఐదో అగ్ని పరీక్షకు సిద్ధమైన నియోజకవర్గమిది. అలాగే వైసిపి అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా రెండో గెలుపుకు తహతహలాడుతున్నారు. పోలింగ్ బాగా జరిగింది. గ్రామీణ ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. పోటీ ఇరు పార్టీల మధ్య హోరాహోరీగా నడిచింది.

## 'ప్రభా'తం

# ఈ తీరు మారాలి

**ఎన్నికలొస్తే చాలు..ఎక్కడ చూసినా నోట్ల కట్టల గుట్టలు, మద్యం ప్రవాహాలే!..అధికారులెంతగా దాడులు చేస్తూనే ఉన్నా అవి కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఇకనైనా ఈ తీరు మారాలి. వీటన్నిటినీ పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఎన్నికల సంఘం మరింత గట్టి చర్యలు తీసుకోవాలి. ఎన్నికల విధానాలనూ పటిష్టం చేయాలి. అవసరమైతే కొత్త చట్టాలను తేవాలి. ప్రపంచంలోనే..మనదేశం నీతినిజాయితీలకు ప్రతీకగా.. అత్యుత్తమ ప్రజాస్వామ్యపు పతాకగా నిలిచేలా తీర్చిదిద్దుకోవాలి!**

ఎన్నికలొస్తే చాలు.. ఎక్కడ చూసినా నోట్ల కట్టల గుట్టలు, మద్యం ప్రవాహాలే!.. అధికారులెంతగా దాడులు చేస్తూనే ఉన్నా అవి కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తూనే ఉన్నాయి. మనదేశంలో ఎన్నికలంటే.. డబ్బు.. మద్యం ప్రవాహాలనే అపనిందకు గురిచేస్తున్నాయి. ఎన్నికలొచ్చాయంటే చాలామందికి పండుగలా ఉంది. ఇది మంచి ఛాన్స్!.. ఇంతకంటే అవకాశం మళ్లీ అయిదేళ్ళ దాకా రానేరాదు కనుక, దీపం ఉండగానే.. అన్నీ చక్కబెట్టేసుకోవాలనుకునే స్వార్థం సర్వత్రా ప్రబలిపోతోంది.

అయినా, కలికాలం ప్రభావమో ఏమో కానీ, అటు నాయకులు.. ఇటు ప్రజలు కూడా ఎక్కువమంది ఇలాంటి అపసవ్య ధోరణిలోనే సాగిపోతుండడం ఎంతైనా బాధాకరం!.. అట్లని అందరూ ఇలాగే ఉంటారని చెప్పలేం... ఎంతోమంది నిజాయితీపరులూ లేకపోలేదు. నాయకులు మాత్రం అందరినీ ప్రలోభపెట్టి ఓట్లు రాబట్టేందుకు దారులు వెతుక్కుంటుంటారు. ధనమా!.. మద్యమా!.. ఏదో ఒకటి, లేదా రెండూ మీ కోసం రెడీగానే ఉన్నాయంటూ ఊరిస్తుంటారు. ఈసారి ఎన్నికల్లో కూడా వేలకోట్ల రూపాయల ధనం పొంగిపొర్లింది. కోట్లాది లీటర్ల మద్యం ప్రవాహం దేశమంతటా వెల్లువెత్తింది. ఓట్ల కోసం డబ్బును, మద్యాన్ని ఎరగా వేసే దుశ్చర్యలు సర్వసాధారణమైపోయాయి. ప్రత్యేకించి మనరాష్ట్రంలో ఓటు కోసం పూటుగా నాటుసారా కూడా సరఫరాకు సిద్ధమైందంటే విడ్డూరమేం కాదు.

ఈ ఎన్నికల రోజుల్లో... అంటే మార్చి 1 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు అధికారులు పట్టుకున్న మద్యం వివరాలు చూస్తే.. ఈ ఎన్నికల్లో మద్యం ప్రవాహం ఎంతగా పోటెత్తిందో తెలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 6,18,365 లీటర్ల మద్యాన్ని పట్టుకోగా, ఇందులో 1,43,811 లీటర్ల నాటుసారా కూడా ఉంది. మరో 2,37,937 లీటర్ల లిక్కర్, 2,25,497 లీటర్ల బీర్ వగైరాలున్నాయి. ఇవి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పన్ను చెల్లించని ఎన్‌డిపిఎల్ మద్యాన్ని కూడా 11,119 లీటర్లు పట్టుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు 22.99 కోట్ల రూపాయలట. ఇవి మొన్నటికి పట్టుబడినవి..పట్టుబడకుండా దొంగచాటుగా ఇంకెంత భారీస్థాయిలో మద్యం సరఫరా అయిపోయిందో ఎవరికెరుక?.. మరోపక్క, ఎన్నికల వ్యయం కూడా భారీగా పెరిగిపోయింది. ఎన్నికల కమిషన్ విధించిన పరిమితికన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా డబ్బు ఖర్చుపెట్టే అభ్యర్థులకు మనదేశంలో కొదవే లేదు. ఎన్నికల వ్యయం అత్యంత భారీగా పెరుగుతుండడం వల్ల సామాన్యులనేవారు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేనే లేదనుకోండి..అది వేరే విషయం!.. అభ్యర్థులు కోట్ల రూపాయలు వెదజల్లితే తప్ప ఎన్నికల్లో గెలవలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికల్లో నిలిచేది..గెలిచేది ఎందుకంటే, తాము ఖర్చుపెట్టిన దానికన్నా ఎక్కువ సంపాదించుకోవడానికే కదా..అన్నట్లుగా ఉంది పరిస్థితి. దీన్నిబట్టి చూస్తే ఇదంతా రాజకీయంగా కాక, ఒక వ్యాపారంగా మారుతోందని సామాన్యుని సణుగుడు. ఈ నేపథ్యంలో అభ్యర్థి ఖర్చుపెట్టే మొత్తాల వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలపాలనే నిబంధనలున్నా, అసలు అభ్యర్థి నేరుగా ఖర్చుపెట్టే మొత్తం కంటే, వారి బినామీ వ్యక్తులు ఖర్చుచేసే మొత్తాలకు లెక్కాలెక్కాడుంటున్నాయి?.. ఎన్నికల సంఘానికి దొరక్కుండా ఇలాంటి వెన్నో సైగ్గా జరిగిపోతూనేవున్నాయి. ఎన్నికల వేళ తనిఖీలు ముమ్మరంగా ఉన్నా.. నోట్ల కట్టలు మూటలకొద్దీ దొరుకుతున్నాయంటే.. జనాన్ని ప్రలోభపెట్టడానికి నాయకులు పడుతున్న 'అగచాట్లు' కళ్ళకు కడుతున్నాయి. తనిఖీలో నోట్ల కట్టలు గుట్టలుగా దొరుకుతున్నా, అంతకు మరెన్నో రెట్ల ధనం బినామీల ద్వారా ఆయా ప్రాంతాల్లో చాపకింద నీళ్ళలా ప్రవహించడం తెలియనిదెవ్వరికి?.. అయినా, ఇవన్నీ చాటుమాటు వ్యవహారాలే కదా!..

ఎన్నికల్లో ఎంపీగా నెగ్గాలంటే కనీసం 50 కోట్లదాకా, అసెంబ్లీ స్థానాల్లో గెలవాలంటే కనీసం 10 కోట్లయినా ఉంటే తప్ప జరగని పరిస్థితి. ఎన్నికల్లో గెలిస్తే చాలు.. ఖర్చుపెట్టినదంతా సంపాదించుకోవడమే కాక, మరెంతో ధనాన్ని కూడగట్టుకోవచ్చనేది అనేక మంది నాయకుల ఆలోచన కావచ్చు. అంతే కాదు, అభ్యర్థులు.. తాము గెలిచినా తమ పార్టీ అధికారంలోకి రాకపోతే, అధికారం వచ్చిన పార్టీలోకి దూరిపోవడానికి పార్టీ మారడం చాలా సులభమైపోయింది. ఇలాంటి వాటన్నిటినీ అరికడుతూ మనదేశంలో ఎన్నికల విధానాలు మరింతగా కట్టుదిట్టంగా ఉండాలి. ఎవరైనా పార్టీ మారితే వెంటనే తమ సభ్యత్వం కోల్పోతారని, మళ్ళీ ఎన్నికైనాకనే సభ్యత్వం వచ్చేలా చేయాలి. అంతేకాదు, రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అన్ని పార్టీలకు వచ్చిన ఓట్లశాతం వారీగా వారు గెలుపొందిన సీట్లను కేటాయించే విధానం వస్తే బాగుంటుందనే విజ్ఞుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. దేశంలో ప్రధానిని, ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రు లను నేరుగా ఎన్నుకునే విధానం రావాలి. అవినీతి పరులను, నేరస్తులను ఎన్నికల్లో పోటీకి అనర్హులను చేస్తూ.. రుజువర్తన కలిగిన అభ్యర్థులు ఎన్నికల్లో నిల బడేలా ప్రోత్సహించాలి. ఇలా.. అన్నిరకాల అభి ప్రాయాలను పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవాలి.

ఈ నేపథ్యంలో, ప్రజలు కూడా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. మనదేశం-మన భవిష్యత్తు.. మన ప్రగతి అంతా మన ఓటులోనే ఉందని గుర్తించి, దేశహితాన్ని.. ప్రజాశ్రేయస్సును కోరుకునే విజ్ఞులైనవారిని మనమే విజ్ఞతతో ఎన్నుకోవాలి. ఇకనైనా, ఎన్నికల్లో సర్వసాధారణంగా జరుగుతున్న ధనప్రవాహం, మద్యం ప్రలోభాలు వంటి దుర్నీతులన్నిటినీ.. రకరకాల తాయిలాలిచ్చే లోపాయికారి విధానాలన్నిటినీ పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఎన్నికల సంఘం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. విజ్ఞులు, మేధావులు అందరూ బాగా ఆలోచించి మన ఎన్నికల విధానాలను మరింత బాగా పటిష్టం చేయాలి. అవసరమైతే కొత్త చట్టాలను కూడా తీసుకురావాలి.

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన మన భారతదేశం ప్రపంచమే గర్వించేలా...నీతి నిజాయితీలకు ప్రతీకగా..అత్యుత్తమమైన ప్రజాస్వామ్యానికి పతాకగా నిలిచేలా మన విధానాలను మనమే పటిష్టం చేసుకోవాలి..బంగారు భారతావనిని మనమే తీర్చిదిద్దుకోవాలి!...

---

## విళంబికి వీడుకోలు..

# వికారికి వేడుకోలు

### - ఆకట్టుకున్న ఉగాది 'పద్య కవిసమ్మేళనం'




ముఖ్యఅతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పద్యసారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదిన పద్యసారస్వత పరిషత్ సభ్యులు డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాదరావు నివాసంలో జరిగిన 'విళంబికి వీడుకోలు-వికారికి వేడుకోలు' అనే అంశంపై జరిగిన పద్య కవి సమ్మేళనం అందరినీ బాగా ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శతావధాని డా. సూరం శ్రీనివాసులు సభాసంచాలకులుగా పాల్గొని పద్యసాహిత్యం ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. పద్యకవులు ఊరుబిండి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, పోలవరపు లక్ష్మీనరసింహారావు, డా.సూరం శ్రీనివాసులు, శతావధాని కొండపి మురళీకృష్ణ, డా.సింహరాజ్, అవధాని కోట రాజశేఖర్, తంగిరాల నరసింహకుమార్, దేవరకొండ మురళీకృష్ణ, అన్నవరం సత్యనారాయణ పాల్గొని తమ కవితలతో విళంబి నామ సంవత్సరానికి వీడుకోలు, శ్రీవికారి నామ సంవత్సరానికి స్వాగతం చెప్పారు. ఈ కవిసమ్మేళనానికి డా.సింగరాజు ప్రసాదరావు అధ్యక్షత వహించారు.

---




## చరిత్రలో లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ఎన్నికల్లో అత్యంత దుర్మార్గపు రాజకీయాలు చేశాడు. ప్రజల డబ్బుతోనే ప్రజల ఓట్లు కొనాలని చూశాడు. పసుపు-కుంకుమ, అన్నదాత సుఖీభవ వంటి తాత్కాలిక పథకాలతో ఖజానాను ఖాళీ చేసి పెట్టాడు. రాష్ట్రంలో ఇక ఎటువంటి అభివృద్ధి పనులకు నిధులుండవు. ఉద్యోగులకు జీతాలిచ్చే దిక్కు లేకుండా పోయింది.

పి.వి.ప్రసన్నకుమార్, నెల్లూరు.

## ప్రత్యక్ష ఎన్నిక రావాలి

ప్రపంచంలో 194 దేశాలుంటే, మనకంటే దరిద్రంగా బ్రతికే దేశాలలోనూ ఓట్లు అమ్ముకునే సంస్కృతి లేదు. ఐదేళ్లకోసారి ఏర్పడే ప్రభుత్వాన్ని ఎంతో బాధ్యతాయుతంగా ఎన్నుకోవాల్సిన ప్రజలు కేవలం వెయ్యి, రెండు వేలు డబ్బులు తీసుకుని క్షణికావేశంతో నిర్ణయాలు తీసుకుంటుండడం బాధాకరం. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది ఎంత మాత్రం మంచిది కాదు. దేశంలో ఎన్నికల విధానాన్ని సమూలంగా మార్చాలి. దేశ ప్రధాని, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికకు నేరుగా ఎన్నిక నిర్వహించాలి. అప్పుడే ఎన్నికల్లో ధన ప్రభావం కొంతన్నా తగ్గుతుంది.

మల్లెల సతీష్, చింతోపు.

## విలువలు వదిలిన మీడియా

తెలుగు రాష్ట్రాలలో మీడియా చెడిపోయిందని తెలుసు. ఈ ఎన్నికల్లో పూర్తిగా చెడిపోయింది. మీడియా అధిపతులు ఎంతగా విలువలు వదిలేసి బ్రతుకుతున్నారన్నది ఈ ఎన్నికల్లో వారి వ్యవహారశైలిని బట్టే అర్థమవుతుంది. మరీ రాజకీయ పార్టీలకు ఏజంట్లుగా మారిపోయారు. పార్టీ అధినాయకులకంటే కూడా ఆ పార్టీల గెలుపు కోసం వీళ్లెక్కువ తపన పడుతున్నారు. మీడియా ముసుగులో ఈ బ్రోకరిజం పనులు చేయడంకంటే ఇంకేదన్నా వ్యాపారం చేసుకోవచ్చుగా!

తూనికల నరేష్, నెల్లూరు.

## మళ్ళీ మోడీయే మేలు

భారతదేశం శక్తివంతంగా, ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదగాలంటే ప్రధానిగా మళ్ళీ నరేంద్రమోడీయే రావాలి. ప్రజలు అవినీతి లేని ప్రభుత్వాన్ని కోరుకున్నారు. మోడీతో అది సాధ్యమైంది. పాకిస్థాన్ దూకుడుకు కళ్లెం వేయాలని, ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచాలని కోరుకున్నారు. మోడీ అది కూడా చేశాడు. ఆర్థిక రంగంలో రక్షణ రంగంలో ఈ రోజు దేశం ఎంతో పటిష్టంగా వుందంటే కారణం దానికి మోడీ అవలంబించిన విధానాలే! ఈరోజు రైల్వే, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల రంగాలు అభివృద్ధి చెందాయంటే మోడీ పరిపాలన వల్లే! మరో 5ఏళ్ళు మోడీకి అవకాశమిస్తే ఈ దేశ రూపురేఖలు ఇంకా చాలా మారుతాయి. ప్రగతిలో మన దేశం అగ్రగామి అవుతుంది.

సి.రాజీవి, నెల్లూరు.

## పెద్దగా..
# తిరగని పెద్దాయన



నెల్లూరు లోక్‌సభ టిక్కెట్ తనకు ఇవ్వలేరనే బాధ ఈసారి మేకపాటి రాజమోహన్‌రెడ్డిలో స్పష్టంగా కనిపించింది. ఆయన టిక్కెట్‌పై చాలానే ఆశలు పెట్టుకుని వున్నాడు. 2010లో జగన్ వైసిపిని పెట్టినప్పుడు ఆయనను మొండిగా అనుసరించిన నాయకుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి. రాజకీయాలు, ఎన్నికలన్నాక ఖర్చుతో కూడుకున్న పని. ఈ విషయంలో రాజమోహన్‌రెడ్డికి కొంచెం గట్టోడనే పేరుంది. అది పక్కనపెడితే జగన్‌వైపు మాత్రం ఆయన ఏకపక్షంగా నిలబడ్డాడు. వైసిపిలోకి వచ్చాక తన ఎంపి పదవికి రాజీనామా చేయాల్సి వస్తే చేశాడు. ఉపఎన్నికల్లో నిలబడాల్సివస్తే నిలబడ్డాడు. 2012, 2014 ఎన్నికల్లో వైసిపి నెల్లూరు ఎంపీగా పోటీచేసి గెలిచాడు. ప్రత్యేక హోదా పోరాటంలో భాగంగా జగన్ రాజీనామాకు ఆదేశిస్తే వెంటనే రాజీనామా చేశాడు. వైసిపి తరఫున ఢిల్లీలో జరిగిన అన్ని ఆందోళనలలో ముందుండి నడిచాడు.

అలాంటి మేకపాటి రాజమోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో వివిధ కారణాలతో సీటు రాలేదు. ఈ విషయంలో ఆయన తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాడనే తెలుస్తోంది. అయితే పార్టీకి వ్యతిరేకంగా పోలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన నాయకుడు... ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలలో తన తమ్ముడు, కొడుకుల ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యాడు.

వైసిపికి ఒక పెద్ద దిక్కు మేకపాటి రాజమోహన్‌రెడ్డి. నమ్మకానికి నిలువెత్తు చిరునామా. వైసిపి కనుక అధికారంలోకి వస్తే ముందు ఇలాంటి విశ్వసనీయతగల నాయకులను గౌరవించుకోవాల్సి వుంది.

# ఛీ... ఛీ... జర్నలిజాన్ని దిగజార్చిన పాతపేపరు




'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారి సిద్ధాంతాలకు, ఆశయాలకు, ఆకాంక్షలకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ గత 37 సంవత్సరాలుగా పాఠకుల అభిమానాన్ని అపారంగా చూరగొని, నీతి నిజాయితీలకు వేదికగా నిలిచిన మా(మీ) 'లాయర్' వారపత్రిక మరోసారి తన నైతికతను చాటుకుంది. ఎందరు ఎన్ని రకాలుగా ఒత్తిడులు తీసుకొచ్చినా ఎక్కడా తలవంచక, మడమ తిప్పక ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ తన నిబద్ధతను నిరూపించుకుని, కూలీ రాతలకు, గాలి వార్తలకు 'లాయర్' ఎప్పుడూ దూరంగానే వుంటుందని ఋజువు చేసుకుంది.

అయితే, ఈ ఎన్నికలను తన స్వార్థం కోసం పూర్తిగా వాడుకుని సంపాదనే ధ్యేయంగా కూలీ రాతలే లక్ష్యంగా తన అసలు స్వరూపాన్ని ప్రదర్శించింది పాత పేపరు. బీద మస్తాన్‌రావు, మంత్రి నారాయణ, సోమిరెడ్డి, కురుగొండ్ల, బొల్లినేని రామారావు, బొల్లినేని కృష్ణయ్య, అబ్దుల్ అజీజ్, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డిలకు తన పత్రికను తాకట్టుపెట్టి పత్రికా రంగం పరువును బజారుకీడ్చింది ఆ పాత పేపరు.

కస్తూరిదేవి విద్యాలయ సంక్షేమమే ధ్యేయంగా నిభద్దతతో నిజాయితీగా వార్తలు రాసిన తరుణంలో కూలిరాతలు రాస్తున్నారంటూ 'లాయర్' పై విషం కక్కిన ఆ పాత పేపరు ఇప్పుడు తన నైజాన్ని తానే బయట పెట్టుకుంది. ప్రధానంగా ఒక రాజకీయ పార్టీకి తొత్తుగా మారి గత నాలుగువారాలుగా పూర్తిగా కూలి రాతలకే అంకితమై పత్రికను కరపత్ర స్థాయికి దిగజార్చింది.

ధనమే ధ్యేయంగా సంపాదనే లక్ష్యంగా నీచాతి నీచంగా పత్రికా విలువలను మంటగలిపింది. పత్రిక వెలువడాల్సిన తేదికంటే మూడు రోజుల ముందే ప్రచురించి రద్దీ ప్రాంతాలలో ఉచితంగా పంచిపెట్టి పాత్రికేయ విలువలకు వలువలు వూడదీసింది.

విజ్ఞులు, విజ్ఞానవంతులు విచక్షణాపరులైన నెల్లూరీయులకు ఏ పత్రిక నైతికత ఏపాటిదో తెలిసిపోయింది. మాది దశాబ్దాల చరిత్ర అని గొప్పలు చెప్పుకుంటున్న ఆ పాత పేపరు చంటోడి ముడ్డి తుడవడానికి కూడా పనికిరాదని అందరికీ అర్థమైపోయింది.

ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని, ఎదుటి వారిని విమర్శించే ముందు ఒక్కసారి గురివింద గింజ సామెత గుర్తుచేసుకుంటే మంచిది.

## రెండు నియోజకవర్గాలు...
# రెండు ఇంటి పేర్లు






ఈ ఎన్నికలలో ఉదయగిరి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలు టిడిపి, వైసిపి అభ్యర్థుల ఇంటి పేర్లు రెండే కావడం గమనార్హం. ఈ రెండు నియోజకవర్గాల నుండి కూడా బొల్లినేని వర్సెస్ మేకపాటి అన్నట్లుగా పోటీ వుంది. ఉదయగిరి తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని రామారావు కాగా, వైసిపి అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి. అలాగే ఆత్మకూరు తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్య కాగా, వైసిపి అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డి. టిడిపి అభ్యర్థులకు బంధుత్వం లేదుగాని, వైసిపి అభ్యర్థులిద్దరూ బాబాయ్, అబ్బాయ్ అవుతారు. మరి పోటీలో బొల్లినేని గెలుస్తాడో, మేకపాటి గెలుస్తాడో చూడాలి!?



## ఆశీర్వచనం

ఈ నెల 6వ తేదీన వికారి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టట్ ఆర్.ముత్యాలరాజు దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు


మాకు మార్గదర్శకులు మా పెద్దాయన



శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత: సిపిఆర్ కల్యాణ మండపం, శివప్రియ లాడ్జి

మా పురోభివృద్ధికి కారకులు, మా వెన్నుతట్టి ముందుకు నడిపిన మంచి వ్యక్తి
మా భవిష్యత్తుకు భరోసానిచ్చిన మహోన్నత శక్తి మా "పెద్దాయన"

5వ వర్ధంతి సందర్భంగా
ఆ మహనీయుని స్మరించుకుంటూ...



షేక్ రియాజ్ బాషా
రియాజ్ హైదరాబాద్ లైటింగ్ హౌస్ & హైరర్స్
మాగుంట లే అవుట్, నెల్లూరు. సెల్. 94402 76032

## ఓటింగ్‌కు ఆహ్వానం

# అందర్నీ ఆకట్టుకుంది

రండి... ఓటేయండి... ఆహ్వాన పత్రిక... అనే నినాదాలతో జిల్లా కలెక్టర్ రూపొందించిన ఫ్లెక్సీలు అందర్నీ బాగా ఆకట్టుకున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటర్లను పోలింగ్‌కు ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీల ప్రభావం ఓటర్లపై పడింది. ఎప్పుడూ ఓటింగ్ పట్ల నిర్లక్ష్యంగా వుండేవాళ్ళు కూడా ఈసారి ఓటు హక్కుపై చైతన్యవంతులై ఓటింగ్‌లో పాల్గొన్నారు.




## నెల్లూరు కబుర్లు

# జనహిత వాత్సల్యకు రూ.లక్ష విరాళం


సామంతు గోపాల్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న కె.వి.చలం

నిరాధార బాలబాలికలకు అండగా వుంటూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న నెల్లూరులోని జనహిత వాత్సల్యకు డికెడబ్ల్యూ విశ్రాంత అధ్యాపకులు, అనేక సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న కెవి చలం, ఆయన సతీమణి డి.సరోజిని 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా 2019-2020 సంవత్సరానికి బాలబాలికలకు ఒక జత సివిల్ డ్రస్ కోసం ఈనెల 6 న రూ.లక్ష చెక్కును జనహిత వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, సంఘటనా కార్యదర్శి జి.వి సాంబశివరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కెవి చలం మాట్లాడుతూ తన 84 వ ఏటా కూడా నిత్యం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని, జనహిత వాత్సల్య చక్కని సేవా సంస్థ అని, ఇక్కడ నివసిస్తున్న నిరాధార బాలబాలికల ఉన్నత చదువులకు, సాంస్కృతిక కార్యక్రమాలైన వేదం, మోరల్ క్లాస్‌లను తాను నిత్యం గమనిస్తున్నానని అందువల్లనే ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.

## వందపైనే...

# బస్సులు నడిపారు

ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇతర నగరాల నుండి తమ సొంత జిల్లాకు విచ్చేసిన నెల్లూరీయుల కోసం నెల్లూరు ఆర్టీసీ వాళ్ళు వందకుపైగానే బస్సులు నడిపారు. 10వ తేదీ రాత్రే హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, ఇతర నగరాల నుండి నెల్లూరుకు వందకుపైగా బస్సులు వేశారు. ఈ నగరాల నుండి పెద్దఎత్తున ఓటర్లు జిల్లాలోని తమ తమ గ్రామాలకు చేరుకున్నారు. 12వ తేదీ ఒక్కరోజు చాలామంది సెలవు పెట్టుకోవడం, 13, 14తేదీలలో శని, ఆదివారాలు సెలవులు కావడంతో వరుసగా నాలుగురోజులు వారికి కలిసొచ్చినట్లయ్యింది. ఎక్కువమంది 14వ తేదీ రాత్రికి తిరుగు ప్రయాణాలు పెట్టుకోవడంతో ఆరోజుకు కూడా ఆర్టీసీ వాళ్ళు బస్సులు సిద్ధం చేశారు.

## బయ్యా బ్రదర్స్ ఆధ్వర్యంలో..

# చల్లని మజ్జిగ




ఈ మండు వేసవిలో చల్లని మజ్జిగ ఇచ్చి దాహార్తి తీర్చేందుకు నెల్లూరులోని చిన్నబజార్‌లో న్యూ రాజ్యలక్ష్మి హాల్, శుభమస్తు షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉగాది సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ షాపింగ్‌మాల్స్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా వెంకటరవి కుమార్‌లు మాట్లాడుతూ ఈ చలివేంద్రం ద్వారా నూరు రోజుల పాటు ప్రజలకు ఉచితంగా మజ్జిగ అందజేస్తామన్నారు.

## సముద్ర జీవరాశితో మందుల తయారీపై..

# సరికొత్త పుస్తకం

### ఆవిష్కరించిన కె.వి.రత్నం



సముద్ర సంపద ద్వారా మందులు ఎలా తయారు చేసుకోవాలి అనే అంశం ఆధారంగా డాక్టర్ ఆర్.సంతానం, రత్నం ఫార్మశీ ప్రిన్సిపాల్ యం.గోపినాథ్, యస్.రమేష్‌లు రచించిన 'బయాలజీ మరియు ఎకాలజీ ఆఫ్ ఫార్మాసుటికల్ మెరైన్ మోలాస్కిస్' అనే పుస్తకాన్ని 9వ తేదీ రత్నం విద్యా సంస్థల అధినేత కె.వి.రత్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర జీవరాశుల నుండి సులభంగా మందులు తయారు చేయడానికి ఈ పుస్తకంలోని అంశాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. మెరైన్ బయాలజీ మరియు ఫార్మశీ కోర్సులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పుస్తకంలో 275 సముద్ర జీవజాతుల గురించి వివరించారని చెబుతూ పుస్తక రచయితలను ఆయన అభినందించారు.

## 13 నుండి ట్రంకురోడ్డు సాయిమందిరంలో..

# శ్రీరామనవమి జన్మదిన ఉత్సవాలు

నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్ లో వున్న శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో ఈనెల 13 నుండి 15వ తేదీ వరకు శ్రీరామనవమి జన్మదిన మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు మందిర అధ్యక్షులు మన్నెం అమరనాధరెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.30గంటలకు బాబా వారికి మహా న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక సహస్రనామ, అష్టోత్తర పూజలు జరుగుతాయన్నారు. 13 వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు మహిళా భక్తులచే సామూహిక శ్రీ విష్ణు సహస్రనామం, శ్రీ లక్ష్మీ సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. 14న సాయంత్రం 7.30 గంటలకు శ్రీ గోదాదేవి భక్తమండలిచే కోలాటం, 15న సాయంత్రం 6.30 గంటలకు శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం కోలాట భజన మండలిచే కోలాటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని బాబా వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

# ఇద్దరు కార్పొరేషన్ ఉద్యోగులకు సస్పెన్షన్

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన కార్తీక్‌రెడ్డి, వంశీనాథ్‌రెడ్డి అనే ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ ఈ నెల 6న నగరపాలక సంస్థ కమిషనర్ ఆలీంబాషా ఉత్తర్వులు జారీచేశారు.

## శబరి శ్రీరామక్షేత్రంలో

# వసంత నవరాత్రి ఉత్సవాలు

నెల్లూరు దర్గామిట్ట రాంనగర్‌లోని శబరి శ్రీరామ క్షేత్రంలో ఈనెల 6 నుండి శబరి శ్రీరాముని వసంత నవరాత్రి ఉత్సవాలు అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. 7న ఆలయ ప్రధానార్చకుడు రొంపిచర్ల భావనాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి క్షీరాభిషేకం, తామర పుష్పాలతో అర్చన, మోదుక సమిధులతో హోమం, తదితర విశేష పూజలు నిర్వహించారు. 8న స్వామివారికి తేనెతో అభిషేకం, బిల్వ పత్రాలతో అర్చన తదితర పూజలు, 9న స్వామివారికి గడోదకంతో అభిషేకం, గన్నేరు పుష్పాలతో అర్చన, 10న కొబ్బరి నీళ్ళతో అభిషేకం, కలువ పుష్పాలతో అర్చన, మర్రి సమిధలతో హోమం తదితర విశేషపూజలు చేసారు. 11న స్వామివారికి గంధోదకాభిషేకం, నందివర్ధన పుష్పాలతో అర్చన, అత్తి సమిధలతో హోమం నిర్వహించారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శబరి శ్రీరామ క్షేత్రంలో ఈనెల 13న సీతా జయంతి, 14న సీతాదేవి, కోదండరాముల కల్యాణోత్సవం, 16 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని ఆలయ కమిటీ వారు తెలిపారు.

## బాడీ బిల్డింగ్ పోటీల్లో

# నెల్లూరీయుడికి కాంస్యం

కేరళలోని అలువ పట్టణంలో జరిగిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో నెల్లూరుకు చెందిన షబ్బీర్ ఖాన్ 90 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. ఈ పోటీల్లో కేరళ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణాకు చెందిన బాడీ బిల్డర్స్ శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు.



శ్రీ నూతలపాటి రమణయ్యనాయుడు
జననం: 14.6.1934 మరణం: 04.4.2019

శ్రద్ధాంజలి

శ్రీ నూతలపాటి రమణయ్యనాయుడు గారు
తే.04.04.2019ది గురువారం నాడు పరమపదించినారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమార్తె - అల్లుడు
నలుబోలు పద్మావతి - నలుబోలు బలరామయ్యనాయుడు
నెల్లూరు.
మరియు కుటుంబసభ్యులు


ఉత్తరక్రియలు : తే.18.04.2019ది గురువారం సంగం గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద గల వారి స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


# వాకర్స్ ఉగాది పచ్చడి


ఉగాది ప్రాశస్త్యాన్ని తెలుపుతున్న ఎన్.బలరామయ్యనాయుడు

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు వాకర్స్ మిత్రులందరికీ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవజీవితం ఉగాది పచ్చడిలా.. షడ్రుచుల సమ్మేళనమంటూ, ఉగాది ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ మిత్రులందరూ తెలుగుతనం వెల్లివిరిసే సంప్రదాయ దుస్తులతో ఈ కార్యక్రమంలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి లక్కాకుల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జి.వి.కృష్ణయ్య, ఎన్.సాయిసుబ్బారావు, దొడ్ల జయరామానాయుడు, వీరిశెట్టి హజరత్‌బాబు, డా.కె.సత్యనాథ్, కోసూరి సూర్యనారాయణ, జాలీవాకర్ శ్రీమతి ఇనుకొండ సోను పాల్గొన్నారు.

# ఇట్లాంటి ఎలక్షన్‌లు వద్దురా దేవుడా!?




***ఆంధ్రప్రదేశ్‌లోఅన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ ఒక మంచి పని చేసింది. దీనికి వాళ్ళంతా కూడా ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆ మంచి ఏంటంటే ఎన్నికల షెడ్యూల్‌లో తొలివిడత ఏప్రిల్ 11వ తేదీనే ఏపిలో ఎలక్షన్‌లు ముగించడం. మొదటి విడతలో కాకుండా చివరి విడత మే 18వ తేదీనో, లేక దాని ముందు విడతలోనో ఎలక్షన్ పెట్టుంటే అభ్యర్థులు వాళ్ళ జుట్టు వాళ్ళు పీక్కునేవాళ్ళు. అభ్యర్థులు ఆస్తులు అమ్ముకుని వుండేవాళ్ళు. అదీగాక ఇప్పుడు కాస్తున్న ఎండల దెబ్బకు తిరిగి తిరిగి అభ్యర్థులు కాకుల్లాగా అయ్యేవాళ్ళు. రాష్ట్రంలో ఎలక్షన్‌లు తొందరగా పెట్టి ఒక మంచి పని చేశారు.***

ఇక జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగానే ముగిసాయి. ఎన్నికలన్నాక ఒకటి అరా సంఘటనలు చోటుచేసుకోవడం సహజమే! అయితే జిల్లాలో ఈసారి చాలా ఖరీదైన ఎలక్షన్ జరిగింది. మద్యం ఏరులైపారింది. పచ్చనోట్లు స్వైర విహారం చేసాయి. అటు అధికార తెలుగుదేశం, ఇటు ప్రతిపక్ష వైకాపా... ఖర్చు విషయంలో ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా అన్ని నియోజకవర్గాలలోనూ తెలుగు దేశం, వైసిపి అభ్యర్థులు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. ఓటు ధర వెయ్యి నుండి మూడువేల రూపాయల వరకు పలికింది. ఓటు కొనుగోలు రేటు పెంచడంలో తెలుగుదేశం అభ్యర్థులే కొంచెం పైచేయి చూపించారని తెలుస్తోంది. అన్ని నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం సహకరించుకునే ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయడం వింతైన విషయం. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే చాలామంది అభ్యర్థులు డబ్బు, మద్యం నిల్వ చేసుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక జిల్లా అంతటా పోలీసులు పెద్దఎత్తున తనిఖీలు చేపట్టినా వాళ్ళకు దొరికింది చాలా తక్కువే! అప్పటికే ఎక్కడకు చేరాల్సిన డబ్బు, మద్యం అక్కడకు చేరిపోయింది.

ఈ ఎన్నికల్లో అటు పార్టీల కార్యకర్తలుగాని ఓటర్లు గాని అభ్యర్థులకు చుక్కలు చూపించారు. ఒకప్పుడు కార్యకర్తలు పార్టీ మీద అభిమానంతోనో, లేదంటే పార్టీ అధినేతపై వున్న అభిమానంతోనో అభ్యర్థులకు స్వచ్ఛందంగా పనిచేసేవాళ్ళు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రోజుకు 500 రూపాయలు ఇస్తేనేగాని పార్టీ కార్యకర్త కూడా జెండా పట్టని పరిస్థితి. ప్రతిరోజూ ఇలాంటి కార్యకర్తలకు డబ్బు, మద్యం ఇవ్వాల్సిందే! ప్రతి డివిజన్‌లో పార్టీ ఆఫీసులు తెరవాల్సిందే! ప్రతి ఆఫీసులోనూ ఖర్చులకు ఇంత అని ఇవ్వాల్సిందే! మధ్యలో మళ్ళీ డబ్బులు, మందు చేరలేదని, అవతల పార్టీ వాళ్ళు ఎక్కువ డబ్బులిస్తున్నారని అలకలు... బెదిరింపులు. కార్యకర్తలైతే తమ మూత్రాన్ని పెట్రోల్‌లాగా వెలిగించారు. అభ్యర్థులు కూడా ఎవరి మీద కోప్పడితే ఎక్కడ ఓట్లు పోతాయోననే భయంతో వాళ్ళకు అణిగిమణిగి వుండిపోయారు.

ఓ పక్క ఎండలు ఇంకోపక్క డబ్బుల టెన్షన్... మరోపక్క గెలుపోటముల కోసం వ్యూహాలు... ఇవన్నీకాక డబ్బులు, మద్యం కోసం క్షణక్షణం పీక్కుతినే నాయకులు... ఇలాంటి ఎలక్షన్‌లు ఇక చేయలేంరా బాబూ అని పోటీలో నిలిచిన అభ్యర్థులు వాపోతున్నారు.

# నియోజకవర్గాలు చుట్టిన వీరులు



***లోకం చుట్టిన వీరులు లాగా రాజకీయాలలోనూ నియోజక వర్గాలను చుట్టొచ్చే నాయకులుంటారు. అలా నియోజకవర్గాలు చుట్టిన వీరులు మన జిల్లాలోనూ బాగానే వున్నారు.***

నియోజకవర్గాలు చుట్టిన వారిలో అగ్రగణ్యుడు మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి. జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాల నుండి పోటీ చేసిన ఘనత ఆయనది. 1983లో నెల్లూరు, 1985, 1989, 1994, 2004లలో రాపూరు, 2009, 2014లలో ఆత్మకూరు, 2019లో వెంకటగిరి... ఇదీ ఆయన ఎన్నికల పోటీ ప్రస్థానం. అలాగే మాజీఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికీ నియోజకవర్గాలు చుట్టిన కీర్తి వుంది. 1983, 1985లలో ఉదయగిరి అసెంబ్లీ, 1989, 1996, 1998లలో ఒంగోలు పార్లమెంట్, 2004లో నరసారావుపేట పార్లమెంట్, 2009, 2012, 2014 లలో నెల్లూరు పార్లమెంట్... నాలుగు నియోజకవర్గాలు ఆయన ఖాతాలో వున్నాయి. తిరుపతి తెలుగుదేశం ఎంపీ పనబాక లక్ష్మికి మూడు స్థానాలు మార్చిన రికార్డు వుంది. 1992, 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, 2009లో బాపట్ల పార్లమెంట్, 2019లో తిరుపతి పార్లమెంట్. ఇక స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి ఖాతాలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలున్నాయి. నెల్లూరు లోక్‌సభ వైసిపి అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఖాతాలో అల్లూరు, సర్వేపల్లి అసెంబ్లీ స్థానాలు, నెల్లూరు పార్లమెంట్ స్థానాలున్నాయి. మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఖాతాలో సర్వేపల్లి, కోవూరు వున్నాయి. బల్లి దుర్గా ప్రసాద్‌కు గూడూరు అసెంబ్లీ, తిరుపతి పార్లమెంట్, వెలగపూడి వరప్రసాద్‌కు తిరుపతి లోక్‌సభ, గూడూరు అసెంబ్లీలు మార్చిన దాఖలాలున్నాయి. కొమ్మి లక్ష్మయ్యనాయుడుకు ఆత్మకూరు, వెంకటగిరి అసెంబ్లీ స్థానాల అకౌంట్ వుంది. బీద మస్తాన్ రావుకూ కావలి అసెంబ్లీ, నెల్లూరు పార్లమెంట్ స్థానాలున్నాయి. వంటేరు వేణుగోపాలరెడ్డి ఖాతాలో కావలి అసెంబ్లీ, నెల్లూరు పార్లమెంట్ స్థానాలున్నాయి.

ఇక ఒకే నియోజకవర్గాన్ని నమ్ముకుని వున్న నాయకులు జిల్లాలో లేకపోలేదు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరినే అంటి పెట్టుకుని వున్నాడు. ఆయన వరుసగా ఆరోసారి ఆ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నాడు. బొల్లినేని కృష్ణయ్య మూడోసారి ఆత్మకూరు నుండి పోటీ చేస్తున్నాడు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోవూరు నుండి ఐదోసారి పోటీ చేస్తున్నాడు. నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కోవూరు నుండి వరుసగా 8వసారి పోటీ చేస్తున్నాడు. జిల్లా రాజకీయ చరిత్రలో ఈ రికార్డు ఇంకెవరికీ లేదేమో! కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి నుండి వరుసగా నాలుగోసారి పోటీ చేస్తున్నాడు. అలాగే పరసా రత్నం సూళ్ళూరుపేట నుండి వరుసగా ఆరోసారి పోటీ చేస్తున్నాడు. పి.అనిల్‌కుమార్‌యాదవ్ నెల్లూరు నగరం నుండి వరుసగా మూడోసారి దిగుతున్నాడు.

ఇలా జిల్లాలో నియోజకవర్గాలను చుట్టేసిన నాయకులతో పాటు ఒక నియోజకవర్గాన్నే రాజకీయ జీవితాంతం కనిపెట్టుకుని వున్న నాయకులు ఉండడం గమనార్హం.

# సమర్థత చాటుకున్నారు

## • ప్రశాంతంగా ముగిసిన పోలింగ్





***ఎన్నికలు... జిల్లా ఉన్నతాధికారుల పని తీరుకు, వారి సమర్థవంతమైన పాలనకు పరీక్షలు. నిజమే... ఒక జిల్లా పరిధిలో ఎన్నికలను ప్రశాంతంగా ముగించడమంటే ఆషామాషీ విషయం కాదు. ఉన్నతాధికారులలో ఎంత సారం ఉందన్నది ఇక్కడే బయటపడుతుంది.***

అన్ని ఎన్నికలకంటే కూడా శాసనసభ ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత వుంటుంది. రాష్ట్ర స్థాయిలో అధికార మార్పిడికి మూలం ఈ ఎన్నికలు. కాబట్టే పార్టీల మధ్య, నాయకుల మధ్య తీవ్రమైన పోటీ వాతావరణం వుంటుంది. ఆ ఒత్తిడిలోనే అధికారులు కూడా నలిగిపోతుంటారు. రాజకీయ పక్షపాతానికి తావులేకుండా అన్ని పార్టీలకు సమదూరం పాటిస్తూ నిజాయితీ పనితీరుకు పెద్దపీట వేయడం ద్వారా మాత్రమే అధికారులు తమ సమర్థతను చాటుకుంటుంటారు.

ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా వున్న ముత్యాలరాజుకు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగికి ఈ ఎన్నికలు ఒక పరీక్షా సమయమనే అనుకోవాలి. వారికి జిల్లా ఉన్నతాధికారులుగా తొలి ఎన్నికలే అయినా, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో ఈ ఇద్దరు అధికారులు తమ పాత్రను చాలా బాగా పోషించారు. ఏ గొడవలు లేకుండా ఎన్నికలు ముగియడంతో ఈ ఇద్దరు అధికారులు కూడా సక్సెస్ అయినట్లేనని చెప్పుకోవచ్చు!

జిల్లాలో నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలతో పాటు పది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఉదయగిరి, వెంకటగిరి, సర్వేపల్లి, కావలి, కోవూరు, నెల్లూరురూరల్ నియోజకవర్గాలలో కొన్ని గ్రామాలలో ఎలక్షన్‌లు అంటేనే పాత కక్షలు పురివిప్పుతాయి. జిల్లా ఉన్నతాధికారులిద్దరు కూడా ఇలాంటి గ్రామాలను గుర్తించి, బందోబస్తును కట్టుదిట్టం చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలు నిర్వహించారు.





శ్రీ షిర్డి సాయిబాబా వారి శ్రీరామనవమి జన్మదిన మహోత్సవములు

13-4-2019 శనివారం నుండి 15-4-2019 సోమవారం వరకు

పై దినములలో ప్రతిరోజు ఉదయం 7.30 గం॥ల నుండి శ్రీ బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.100/- చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది.

- 13-04-2019: భక్తజన బృందంచే శ్రీలక్ష్మీ, శ్రీ విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణము సాయంత్రం 6.30గంటలకు
- 14-04-2019: శ్రీ గోదాదేవి భక్త మండలిచే కోలాటం రా॥7.30గంటలకు
- 15-04-2019: శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం కోలాట భజన మండలిచే కోలాటం సాయంత్రం 6.30గంటలకు

గమనిక: పై మూడు రోజులు సాయంకాలం గం.6.00ల నుండి గం.6.30ని.ల వరకు హారతులు జరుగును.


ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిర్డి సాయిబాబా మందిరము

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

# తెలుగు పద్యానికి.. కొత్త వెలుగు

- నెల్లూరుసీమ నుంచి ఊపందుకుంటున్న పద్యపఠన మహోద్యమం
- 'రత్నం' విద్యాసంస్థల అధినేత కెవి రత్నం సహకారంతో విద్యార్థిలోకానికి చేరువవుతున్న తెలుగు పద్యాలు
- ఇప్పటికే మూడున్నర లక్షలకు పైగా 'పద్యరత్నాలు' పుస్తకాల పంపిణీ
- విశ్రాంత అధ్యాపకులు కొండా వెంకటస్వామి, మోపూరు వేణుగోపాలయ్య, సారస్వతాభిమాని పడకళ్ళ ప్రసాద్‌ల అమోఘకృషి




పద్యం తెలుగోడి సొత్తు. తెలుగు సారస్వతంలో పద్యానిది ప్రత్యేకస్థానం. అదో అపురూప ప్రక్రియ. ప్రాచీనకాలం నుంచి పద్యం ఉంది. తెలుగుజాతి వారసత్వంగా.. నేటికీ ప్రజల నాలుకల మీద ఎన్నో పద్యాలు అలవోకగా దొర్లుతూనే ఉంటాయి. అయితే, కాలక్రమేణా పద్యానికి ఆదరణ తగ్గిపోతున్న నేటి కాలంలో... నేటి తరం విద్యార్థి లోకానికి కూడా పద్యం దూరమవుతున్న నేపథ్యంలో ముగ్గురు విద్యావేత్తలు, ఒక సాహిత్యాభిమాని కలసి తెలుగు పద్యానికి కొత్త వెలుగులందించాలని గత కొద్దికాలం నుంచి అమోఘమైన కృషి చేస్తున్నారు. విశ్రాంత అధ్యాపకులు కొండా వెంకటస్వామి, ప్రముఖ సారస్వతవేత్త మోపూరు వేణుగోపాలయ్య, సారస్వతాభిమాని పడకళ్ళ ప్రసాద్‌ల అమోఘ కృషి.. వారి కృషికి పట్టుగొమ్మగా నెల్లూరులోని రత్నం విద్యాసంస్థల అధినేత, కె.వి రత్నం అండదండలతో ఈ పద్య ఉద్యమం ఇటీవలి కాలంలో ఒక మహోద్యమంగా రూపుదిద్దుకుంటోంది. తెలుగుభాషకు బంగారు బాటలు పరుస్తోంది. మాతృభాష పట్ల ఎనలేని మమకారంతో తెలుగుభాషాభివృద్ధికి వీరు చేస్తున్న కృషి అమోఘం. అనితర సాధ్యం!..ఆ వివరాలివీ!.....


సాహిత్యాభిమాని పడకళ్ళ ప్రసాద్, విశ్రాంత అధ్యాపకుడు కొండా వెంకటస్వామి

మన సామాజిక జీవనంలో నైతికవిలువలతో, ధర్మవర్తనతో మనం జీవితం సాగించేందుకు మన తెలుగు పద్యాలు కూడా ఎంతగానో ఉపకరిస్తాయి. ఎందరో మహాకవులు తమ జీవితానుభవాలను పద్యాలుగా చేసి ఆ పద్య మాధుర్యాన్ని శతకాలుగా పంచిపెట్టారు. జీవితసత్యాలను తెలియజేసే ప్రతి పద్యమూ ఒక ఆణిముత్యమే. అలాంటి మధురమైన పద్యాలకు తెలుగుభాషలో కొదవే లేదు. అందులోనూ అమ్మభాష మాధుర్యం కంటే గొప్పది ఏదీ ఉండబోదు. అందువల్ల మన మాతృభాషను ఎల్లవేళలా మనం పరిరక్షించుకోవాలి. అందుకే, చిన్నతనంలోనే పద్యాలు నేర్చుకుంటే జీవితాంతం అవి వారికి గుర్తుండిపోతాయని, భావితరాల వారికి కూడా అవి అందుబాటులోకి వస్తాయని, తద్వారా మంచి జీవితాన్ని సాగించేందుకు ఇవెంతగానో ఉపయోగపడతాయనే సత్సంకల్పంతో నెల్లూరుకు చెందిన పలువురు విద్యావేత్తలు ఈ పద్యమహోద్యమానికి శ్రీకారం చుట్టారు. ఇలా తెలుగుభాషా పరిరక్షణకు కంకణం కట్టుకున్న వీరందరికీ ఈ సందర్భంగా అభినందన చందనాలు!....

## తెలుగు పద్యానికి..
## విశ్రాంత అధ్యాపకుల అవిశ్రాంత సేవలు..

'మాతృభాషను ఏనాడూ విస్మరించరాదు. అందుకే, చిన్నతనంలోనే పద్యపఠనం చేయడం ద్వారా చిన్నారుల్లో అమ్మభాష పట్ల మమకారం ఏర్పడుతుంది. నీతిపద్యాలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు ఇక తెలుగును ఎప్పటికీ మరచిపోలేరు. అందుకే ఈ ప్రయత్నమంతా'!.. అంటున్నారు నెల్లూరు మూలాపేటకు చెందిన సమాజసేవకుడు..విశ్రాంత అధ్యాపకుడు శ్రీ కొండా వెంకటస్వామి. 2000వ సంవత్సరం నుంచి ఆయన తన సొంతనిధులతోనే పద్యాల పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు అందజేసి, ఆ పద్యాలను వారితో కంఠస్థం చేయించి, పోటీలు నిర్వహించేవారు. తనకు వచ్చే పింఛన్‌లో సగం మొత్తాన్ని తెలుగుభాషాసేవకు వినియోగిస్తూ తెలుగు భాషామతల్లి సేవలో తరిస్తున్నారు. పోటీల్లో ప్రతిభతో రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా మంచి బహుమతులు కూడా ఆయన అందజేసేవారు. ఈ ఉన్నతాశయానికి నెల్లూరులోని ప్రముఖ సారస్వతవేత్త శ్రీ మోపూరు వేణుగోపాలయ్య, సారస్వతాభిమాని పడకళ్ళ ప్రసాద్‌లు కూడా ఎంతో సహకారం అందిస్తున్నారు. దీంతో, ఆణిముత్యాలైన కొన్ని పద్యాలను ఒక చిన్న పుస్తకంగా అచ్చువేసి విద్యార్థులకు ఉచితంగా అందజేయడం ప్రారంభించారు. దాదాపు 18 ఏళ్ళుగా ఇలా ఆ విశ్రాంత ఉపాధ్యాయులు చేస్తున్న కృషి..నేటికీ అవిశ్రాంతంగా కొనసాగుతూనే ఉండడం ఎంతో విశేషం. వీరితో పాటు, తెలుగుభాషపై ఎనలేని మక్కువ కలిగిన ప్రముఖ దాత కెవి రత్నం దాతృత్వంతో, తెలుగుభాష పరిరక్షణ కోసం సాగుతున్న ఈ ఉద్యమం ఇటీవలి కాలంలో మరింత ముందడుగు వేస్తుండడం ఎంతైనా అభినందనీయం!...


రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం


సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య

## విద్యారత్నం.. శ్రీ కెవి రత్నం దాతృత్వం...
## లక్షలాది పద్యాల పుస్తకాల ముద్రణ

పద్యాన్ని చిన్నారుల హృదయాలకు చేరువచేసి తద్వారా తెలుగు భాషామతల్లిని సదా స్మరించుకునేలా చేసే ఈ మంచి ప్రయత్నానికి అండగా నెల్లూరులోని 'రత్నం' విద్యాసంస్థల అధినేత, ప్రముఖదాత.. విద్యారత్నం శ్రీ కెవి రత్నం, ఆయన సతీమణి శ్రీమతి పద్మావతి రత్నం ముందుకు రావడం, అనుకున్నదే తడవుగా లక్షలాదిరూపాయలు వెచ్చించి లక్షలాదిగా ఈ పద్యప్రతులను ముద్రించడమే కాక, పద్యపోటీల్లో విద్యార్థులకు ప్రదానం చేసేందుకు వేలాది ప్రశంసాపత్రాలను కూడా అందంగా ముద్రించి విద్యార్థులకు అందజేస్తుండడం ఎంతో విశేషం!.. కెవి రత్నంగారి దాతృత్వంతో ఈ ఏడాది మూడున్నర లక్షల పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందజేశారంటే తెలుగుభాష పట్ల వారికి ఉన్న అభిమానం ఎంత ఘనంగా ఉందో అర్థమవుతుంది. గత ఏడాది ఈ పద్యపఠన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 2800 హైస్కూళ్ళ నుంచి సుమారు లక్షమందికి పైగానే విద్యార్థులు పాల్గొనేందుకు కృషి జరిగిందంటే అతిశయోక్తేమీ కాదు. దీంతో ఈ పద్య ఉద్యమం ఒక మహోద్యమంగా ముందుకు సాగుతోంది. ఈ తెలుగు పద్యాల పుస్తకాల ప్రతులను రాష్ట్రవ్యాప్తంగా వేలాది పాఠశాలలకు చేర్చి, విద్యార్థులకు వాటిని ఉచితంగా అందజేయడమే కాక, వారికి పద్యపఠనంలో పోటీలు నిర్వహించి.. పద్యాల పట్ల, తెలుగుభాష పట్ల విద్యార్థులకు ఆసక్తికలిగేలా ప్రోత్సహిస్తున్న ఈ భాషాభిమానుల సేవలు ఎంతో అభినందనీయమైనవి.. అమోఘమైనవని వేరే చెప్పనక్కరలేదు.

## అమ్మభాషకు కొండంత అండగా :

మాతృభాషను పరిరక్షించుకోవడమే ధ్యేయంగా ఈ పద్య ఉద్యమం ఇప్పుడు ఉరుకులు పరుగులతో ముందుకు సాగుతోంది. మొత్తం 20 పుటలున్న ఆ చిన్ని పద్యాల పుస్తకంలో 6వ తరగతి విద్యార్థులు కంఠస్తం చేయాల్సిన పద్యాలుగా 18 'వేమన పద్యాలు', 7వ తరగతి విద్యార్థుల కోసం సుమతిశతకంలోని 18 పద్యాలు, 8వ తరగతి వారికోసం భర్తృహరి సుభాషితాల్లోని 18 పద్యాలు, 9వ తరగతి వారి కోసం తిక్కన భారతంలోని ఉద్యోగపర్వంలో ఉన్న 18 విదురనీతి పద్యాలు, 10వ తరగతి విద్యార్థుల కోసం మహాకవి పోతన రచించిన ఆంధ్ర మహాభాగవతంలోని 18 పద్యాలు ఎంపిక చేసి ఒక పుస్తకంగా ముద్రించారు. ప్రతిఏటా ఆగస్టు 13, 14 తేదీల్లో సుమారు 1500 పాఠశాలల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలను కూడా అందజేస్తున్నారు. కవిబ్రహ్మ తిక్కన ముఖచిత్రంతో, చదువులతల్లి సరస్వతిని చివరి అట్టపైన ఎంతో అందంగా ముద్రించిన ఈ పుస్తకం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక కరదీపికగా ఉంటోంది. నెల్లూరు జిల్లాతో పాటు ప్రకాశం, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు కూడా ఈ పుస్తకాలను పంపిణీ చేసి, ఆయా తరగతుల విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేసి ప్రోత్సహిస్తున్నారు. ఇదో అత్యుత్తమ తెలుగుభాషాభిమాన కార్యక్రమం. మానవజీవితాలకు అర్థాన్ని పరమార్థాన్ని తెలియజేసి సమాజంలో అందరూ నైతికవిలువలతో ధర్మబద్ధమైన జీవితాలను గడిపేందుకు మార్గాలు చూపే పద్యసాహిత్యం.. తెలుగువారి సొత్తు. ఎంతో సమున్నతమైన ఆశయాలతో, తెలుగుభాషాభిమానంతో, అమ్మభాషకు కొండంత అండగా నిలుస్తూ...నెల్లూరుసీమ నుంచి ప్రారంభమైన ఈ పద్యపఠన మహోద్యమం..రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో బాగా ఆదరణ పొందుతోండడం ఎంతో ఆనందించదగ్గ విషయం. ఇదింకా...ఇంకా విస్తరించి నేటితరానికే కాక..భావితరాల వారికి కూడా తెలుగు పద్యంలోని విశిష్టతను, మాధుర్యాన్ని అందరికీ అందిస్తూ తెలుగుభాషను అజరామరం చేయాలని కోరుకుందాం!..అందుకు తెలుగుభాషాభిమానులందరి సహకారం ఉంటుందని ఆశిద్దాం!...

## అనేక జిల్లాల నుంచి ప్రశంసలు :

ఈ పద్య ఉద్యమానికి పలు జిల్లాల పాఠశాలల నుంచి, తెలుగు పండితుల నుంచి మంచి స్పందనలు వస్తున్నాయి. తెలుగు పద్యాన్ని తెలుగు గడ్డపై ధ్వనింపజేస్తున్న మీ కృషికి నీరాజనమని, అమ్మభాష అంతరించిపోతున్న నేటి సమాజంలో తెలుగుభాష కమ్మదనాన్ని పసిపిల్లల హృదయాల్లో పదిలపరచడానికి విశ్రాంత ఉపాధ్యాయులు, రత్నం విద్యాసంస్థల అధిపతి రత్నంగారు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయమని చిత్తూరుజిల్లా నుంచి పలువురు తెలుగుపండితులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఇలాంటి కృషి వల్ల విద్యార్థుల్లో ధారణశక్తి, ఆలోచనాశక్తి, సృజనాత్మకత పెరుగుతుందని కడపజిల్లా పండితులు అభినందించారు. ముఖ్యంగా రత్నం విద్యాసంస్థల వారు తలపెట్టిన ఈ ఆంధ్ర సారస్వత మహాయజ్ఞం శుభప్రదం కావాలని, విద్యార్థులకు సారస్వతాభిలాష పెంపొందించేందుకు ఇది గొప్ప పునాది అవుతుందని ప్రకాశం జిల్లా నుంచి తెలుగు పండితులు ప్రశంసించారు. ఇలా అనేక జిల్లాల నుంచి ఈ పద్యపఠన మహోద్యమానికి, తెలుగుభాషా పరిరక్షణకు సాగుతున్న ఈ అద్వితీయమైన కృషికి అందరి దీవెనలు అందుతుండడం వదాన్యులు..తెలుగు భాషాభిమానులు శ్రీ రత్నం గారికి, దీనికి ఆద్యులైన కొండా వెంకటస్వామి, మోపూరు వేణుగోపాలయ్య, పడకళ్ల ప్రసాద్ గార్లకే కాక... నెల్లూరీ యులైన మనందరికీ కూడా గర్వకారణం!...

# కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా కె.ఏ.పాల్

గల్పిక

ఏప్రిల్ 11వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట.. పాతిక ప్రపంచ మేటి నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్ చేసి బయటకు తీస్తే వచ్చిన అమరావతి నగరం. కరకట్ట మీద హైటెక్‌రత్న, సీఎం చంద్రబాబు నివాసం. ఆరోజే పోలింగ్ ముగిసింది. ఆరోజు వరకు ఎలక్షన్ టెన్షన్‌లో అలసి సొలసిన నాయకులంతా తమ బెడ్‌రూముల్లో కాళ్లెత్తి పడుకున్నారు. చంద్రబాబు కూడా ఆరోజు పది గంటలకే బెడ్ మీదకు చేరి గురకపెట్టి నిద్రపోయాడు. కాని, ఒంటి గంట సమయంలో నెల్లూరు నుండి వచ్చిన ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు కరుస్తున్నట్లనిపించడంతో భువనేశ్వరీదేవికి టక్కున మెలకువ వచ్చింది. లేచి కూర్చుని పక్కకు చూసింది. అంతే... ఆమె షాక్... పక్కన చంద్రబాబు నాయుడు లేడు. ఈ టైంలో ఈ మనిషి ఎక్కడకు పోయాడనే ఆందోళన ఆమెలో మొదలైంది. వెంటనే లోకేష్ బెడ్‌రూమ్ వద్దకు వెళ్ళింది. లోకేష్.. లోకేష్ అంటూ కేకేసింది. లోపల నుండి మాత్రం... ఏప్రిల్ 9వ తేదీ పోలింగ్... మార్చి 23 కౌంటింగ్... నన్ను 5లక్షల మెజార్టీతో గెలిపించండి... అనే మాటలు వినిపిస్తున్నాయి. భువనేశ్వరీదేవి లోపలకు వెళ్లింది. లోకేష్ నిద్రలో కలవరిస్తున్నాడు. భువనేశ్వరీ అక్కడే వున్న వాటర్‌బాటిల్ చేతిలోకి తీసుకుని లోకేష్ ముఖంపై నీళ్ళు చల్లింది. ఆ దెబ్బకు లోకేష్ టక్కున లేచాడు. ఏమైందమ్మా... ఎన్నికల ప్రచారంలో వుంటే డిస్ట్రబ్ చేసావని అడిగాడు. ఎన్నికల ప్రచారమా, నీ మొహమా, నిద్రలో కూడా సరిగా మాట్లాడలేవా, అవతల మీ నాన్న కనిపించడం లేదు. ఎక్కడకు వెళ్లాడో చూద్దాం పద అంటూ భువనేశ్వరీదేవి కోపంగా అంది. అందుకు లోకేష్... ఈ నాన్నారు ఒకడు... తను నిద్రపోడు, పక్కనోళ్లను నిద్రపోనివ్వడు... పద వెదుకుదాం అంటూ భారంగా లేచాడు. ఆయనతో పాటు బ్రాహ్మణి కూడా బయలుదేరింది. ముగ్గురూ కారెక్కి ఆ చుట్టుపక్కల వెదకసాగారు. అలా వెదుకుతుండగా... "తమ్ముళ్ళూ నేను మోడీకి భయపడతానా" అనే మాటలు వినిపించాయి. లోకేష్ ఆ మాటలు వినిపిస్తున్న వైపుగా కారును పోనిచ్చాడు. వెలగపూడి సచివాలయం వద్ద రోడ్డుపై చంద్రబాబు ప్రచార వాహనం వుంది. క్రింద నైట్ సెక్యూరిటీ సిబ్బంది ఓ పాతిక మంది దాకా వున్నారు. చంద్రబాబు చెవుల్లో మైక్ సిస్టం పెట్టుకుని వున్నాడు. ఆయన వారినుద్దేశించి మాట్లాడుతూ... తమ్ముళ్ళూ మోడీ, కేసీఆర్, జగన్‌లు ఒక్కటయ్యారు. ఇక్కడ జగన్‌కు ఓటేస్తే కేసీఆర్‌కు వేసినట్లే... మన రాష్ట్రంపై పెత్తనం చేయాలని కేసీఆర్ చూస్తున్నాడు. వీళ్ళ ఆటలు నా దగ్గర సాగవు. నేను ఇందిరాగాంధీతో పోరాడాను, జార్జి బుష్‌తో పోరాడాను, జనరల్ డయ్యర్‌తో పోరాడాను, రాజీవ్‌గాంధీతో పోరాడాను... అలాంటి పోరాటాల చరిత్ర వున్న నేను ఈరోజు కోడికత్తి పార్టీతో పోరాడుతున్నాను. తమ్ముళ్ళూ జగన్ గెలిస్తే రౌడీరాజ్యం వస్తుంది. ఒక్కసారి అవకాశమివ్వమంటున్నాడని మీరు మోసపోవద్దు. ఒక్కసారి కదా అని కరెంట్ తీగలు పట్టుకుంటామా... కాబట్టి మీరంతా తెలుగుదేశం పార్టీకి ఓట్లేసి బంపర్ మెజార్టీతో గెలిపించాలి... అని చెప్పుకుంటూ పోతున్నాడు. భువనేశ్వరీదేవికి పరిస్థితి అర్ధమైపోయింది. నెల రోజులుగా తిరిగి తిరిగి ప్రచార యావకు అలవాటుపడ్డాడని, నిద్రలోనూ ఆ పిచ్చి పోలేదని గ్రహించింది. ఈలోపు లోకేష్ ప్రచార వాహనంపైకి ఎక్కాడు. ఆయన చేతిలోని మైకును లాగేసి, క్రిందకు తీసుకొచ్చాడు. ఏమిటండీ ఇది... ఎన్నికలు అయిపోయాయి కదా... ఈ రోజన్నా ప్రశాంతంగా పడుకోకుండా ఏమిటి ఈ హింస అని భువనేశ్వరి అడిగింది. చంద్రబాబు అప్పటికి ఈ లోకంలోకి వచ్చి... ఏం చేయమంటావ్ భువ... నాకు ఇలా రోజుకు రెండు ప్రచార సభల్లోనన్నా మాట్లాడనిదే నిద్రపట్టడం లేదు. నా బాడీ ఆ విధంగా అలవాటై పోయింది అని చెప్పాడు. దానికి భువనేశ్వరి... ఇంకా మీరు మీటింగ్‌లు పెట్టడానికి రాష్ట్రంలో ఎన్నికలు లేవుగా అని అంది. అప్పుడు లోకేష్.. ఏపిలో ఎన్నికలు అయిపోతేనేం మమ్మీ... ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ అంకుల్, పశ్చిమ బెంగాల్‌లో మమతా ఆంటీ, జమ్మూ కాశ్మీర్‌లో ఫరూక్ తాతయ్య, కర్నాటకలో దేవేగౌడ పెద్దయ్య తరపున నాన్నను ప్రచారానికి పంపిద్దాము... అలాగన్నా ఆయన ప్రశాంతంగా వుంటాడు అని ఐడియా ఇచ్చాడు. భువనేశ్వరీదేవి అందుకు సరేనంది. వెంటనే లోకేష్ ఫోన్ తీసి... అరవింద్ కేజ్రీవాల్‌కు కొట్టాడు. ఆయన అవతల ఫోన్ ఎత్తగానే లోకేష్ వుండి... హాలో అంకుల్... మీరు మా పార్టీ తరపున ఆంధ్రాలో ప్రచారం చేశారు కదా.. అలాగే నాన్నగారు కూడా ఢిల్లీలో మీ తరపున ప్రచారానికి వస్తారట... ఎప్పుడు రమ్మంటారు అని అడిగాడు. దానికి అరవింద్ కేజ్రీవాల్... నాకున్నదే ఏడు లోక్‌సభ నియోజకవర్గాలు... నాకే ఇక్కడ పని లేకుండా ఖాళీగావున్నాను, మళ్ళీ మీ నాన్నెందుకు... రెస్ట్ తీసుకోమని చెప్పులే అని ఫోన్ పెట్టేశాడు. లోకేష్ మళ్ళీ మమతా బెనర్జీకి ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ ఎత్తగానే.. ఆంటీ ఎలక్షన్ అయిపోయి నాన్నగారు ఫ్రీగా వున్నారు. మీకు ప్రచారానికి పంపమంటారా అని అడిగాడు. అందుకు మమత... నాకు ఇక్కడ అంత అవసరం లేదు. మా ప్రజలకు కొంత ఎంటర్‌టైన్‌మెంట్ అవసరం, వీలైతే నువ్వు రా అని అంది. లోకేష్ ఫోన్ పెట్టేసి... నాన్నగారు... పబ్లిక్‌లో మీకంటే నాకే ఎక్కువ క్రేజ్ వుంది. మమతా ఆంటీ నన్ను ప్రచారానికి పిలుస్తుంది అని చెప్పాడు. ఏడ్చావుగాని... ఆ రాహుల్‌గాంధీకన్నా ఫోన్‌చెయ్... ఆయన ప్రచారం చేయమంటే మే 18వ తేదీ దాకా ఖాళీ లేకుండా తిరగొచ్చు అని చంద్రబాబు చెప్పాడు. వెంటనే లోకేష్ రాహుల్ గాంధీకి ఫోన్ చేశాడు. ఆయన ఫోన్ ఎత్తగానే లోకేష్ వుండి... అన్నగారు, ఏపిలో ఎన్నికలైపోయి నాన్నగారు ఖాళీగా వున్నారు, ఆయనకు ప్రతిరోజూ ఎన్నికల సభలలో పాల్గొనకపోయినా, నరేంద్ర మోడీ, కేసీఆర్‌లను తిట్టకపోయినా నిద్రపట్టడం లేదంట... కాంగ్రెస్‌పార్టీకి మద్దతుగా దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తానంటున్నారు. ఎప్పుడు రమ్మంటారని అడిగాడు. అందుకు రాహుల్... ఇప్పుడు మా ప్రచారానికి చంద్రబాబు గారి అవసరం లేదు. మా స్టార్ క్యాంపెయినర్‌గా కె.ఏ.పాల్‌ను పెట్టుకున్నాం. ఆయన ప్రసంగాలను జనం భలే వింటున్నారు. రావాలనుకుంటే పాల్‌కు సహాయకుడిగా నువ్వురా... నీకూ సొంత ఇమేజ్ వచ్చింది అని రాహుల్ చెప్పాడు. ఆ మాటతో లోకేష్ ఫోన్ పెట్టేసి... నాన్నా... మీకంటే ఆ కె.ఏ.పాల్‌కే ఈ ఎలక్షన్‌తో ఎక్కువ క్రేజ్ వచ్చింది. ఇక నా పోటీ జగన్‌తో కేటీఆర్‌తో కాదు... కె.ఏ.పాల్‌తోనే... అంటూ తన బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు.

## 'నెరసం' ఆధ్వర్యంలో.. ఉగాది సంబరాలు



నెరసం ఉగాది పురస్కారాలందుకున్న వివిధ రంగాల ప్రముఖులు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో ఈనెల 7న ఉగాది సంబరాలు ఎంతో సందడిగా జరిగాయి. నెల్లూరు పురమందిర ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) స్మారక భవనంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్టసేవలందిస్తున్నవారికి ఉగాది పురస్కారాలను అందజేశారు. డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, మెట్టు రామచంద్రప్రసాద్, డివి సురేష్‌రావు, గుర్రాల రమణయ్య, సింగరాజు శ్రీనివాసకుమార్, ఎం.విజయప్రకాష్, లలితాప్రవల్లిక, సోలా జానకిదేవి ఈ పురస్కారాలను అందుకున్నవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర డిఎస్పీ మురళీకృష్ణ, ఓయస్డీ పెంచలరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం కవి సమ్మేళనంలో కవయిత్రులు జయభారతి, బొగ్గరపు ఇందిరాకృష్ణ, ఉషారాణిలతో పాటు ప్రముఖ కవులు ఊరిబిండి వేంకటసుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, ఇనమనమెళ్ళూరు నాగరాజారావు, రాచపాళెం రఘు, మోపూరు పెంచలనరసింహం, భక్తకవి పెనగలూరి, మద్దూరు శ్రీనివాసులు పాల్గొని ఉగాది కవితాగానం చేశారు. నెరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆచార్య ఆదిత్య, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ కమిటీ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రగంటికి పురస్కారం



ఉగాది పురస్కారాన్నందుకుంటున్న ఇంద్రగంటి

ప్రముఖ కవి ఇంద్రగంటి మధుసూదన్‌రావుకు ఈనెల 5న 'మధురకవి ఫౌండేషన్' సంస్థ వారు ఉగాది పురస్కారాన్ని అందజేశారు. పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో భాగంగా పాల్గొన్న ఇంద్రగంటికి ఆ సంస్థ వ్యవస్థాపకులు దుప్పటి రమేష్ బాబు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పెరసం అధ్యక్ష కార్యదర్శులతో పాటు పలువురు కవులు, కవయిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంద్రగంటిని అభినందించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

### జిల్లా ప్రజలు...

## సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 6న నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జిల్లా సృజనాత్మక సంస్కృతి సమితి ఆధ్వర్యంలో శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్-2 శ్రీమతి సాధన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలంటూ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోమిడి వెంకటరాజు బృందంచే నాదస్వరం, వేదపండితుడు చంద్రశేఖర అవధానిచే పంచాంగశ్రవణం నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన కవిసమ్మేళనంలో కవులు ఆలూరు శిరోమణిశర్మ, శ్రీనివాసకుమార్, పెనగలూరు కుమార్, బిరదవోలు రామిరెడ్డి, తోట సులోచన, గుండాల నరేంద్రబాబు, దువ్వూరు సుమలత పాల్గొని ఉగాదిని ఆహ్వానిస్తూ కవితాగానం చేశారు. గురుకృప కళాక్షేత్రం నిర్వాహకురాలు సురభి గాయత్రి బృందం, శ్రీ గురుదత్త కళానిలయం నిర్వాహకురాలు కల్పన బృందం, కొండగుంట త్రిపుర, నిఖిత, సిద్దేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం, రోషిత్, అభిషేక్ కళాబృందాల వారి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సమాచార పౌరసంబంధాల ఉపసంచాలకులు వెంకటేశ్వరప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి శ్రీనివాసకుమార్, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాయిబాబా, దేవాదాయశాఖ అధికారి వేగూరు రవీంద్రరెడ్డి, రంగనాధస్వామి దేవస్థానం ఇ.ఓ వేమూరి గోపి తదితరులు పాల్గొన్నారు.





ముఖ్యఅతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

### సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# సంస్కృతి - తెలుగు ఉగాది

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సర్వేపల్లి రామమూర్తి సారధ్యంలో ఈనెల 4న జరిగిన ఉగాది కవిసమ్మేళనం అందరినీ బాగా అలరించింది. నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని ఆర్‌ఎల్‌రెడ్డి స్మారకభవనం (జూనియర్) క్రింది హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 'సంస్కృతి-తెలుగు ఉగాది' అంశంపై కవిసమ్మేళనం నిర్వహించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావుకు, ఉయ్యూరుకు చెందిన ప్రముఖ రచయిత గబ్బిట దుర్గాప్రసాద్‌కు ట్రస్ట్ తరపున ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ రద్దయిన ఆంధ్రప్రదేశ్ అకాడమీని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానన్నారు. నెల్లూరు నగర డిఎస్పీ మురళీకృష్ణ, ఓయస్డీ పెంచలరెడ్డి, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు సర్వేపల్లి ప్రభాకర్‌రావు, ఏపియుడబ్ల్యుజె నాయకుడు ఎ.జయప్రకాష్, ఆచార్య ఆదిత్య, తిరువీధి ప్రకాష్‌రావు, డా.ఎస్‌వి రమేష్; శిరోమణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

### జాషువా కవితా పీఠం ఆధ్వర్యంలో

# అలరించిన కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

వికారినామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 11న జాషువా కవితాపీఠం ఆధ్వర్యంలో నెల్లూరులోని పద్మభూషణ్ గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ సభకు జాషువా కవితాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బూతపాటి కిరణ్‌శ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కవులు మోపూరు పెంచల నరశింహం, తోట సులోచన, ఇంద్రగంటి మధుసూదనరావు, దుప్పటి రమేష్ బాబు, దువ్వూరు సుమలత, అల్లాడి వేణుగోపాల్, ఎలమందయ్య, పల్లాపు రామ్, అన్నం శివకృష్ణ, జంజం కోదండరామయ్య, గుర్రం అరుణ్ కుమార్, నీలం స్వాతి, ఇసనాక దయాకర్‌రెడ్డి కవిసమ్మేళనంలో పాల్గొని కవితలు వినిపించారు. వీరిని శాలువ, జ్ఞాపికలతో జాషువా కవితాపీఠం నిర్వాహకులు సత్కరించారు. కవితా పీఠం ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు, కోశాధికారి కొమ్మల కృష్ణయ్యలు పాల్గొన్నారు.

## 12 నుండి సంతపేట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు సంతపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 12 నుండి 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.రామకృష్ణ తెలిపారు. 12న సాయంత్రం 7గంటలకు అంకురార్పణతో ఈ కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, 13న ఉదయం 8.30గంటలకు ధ్వజారోహణం, 11 గంటలకు తిరిచి ఆలయ ఉత్సవం, రాత్రి 8గంటలకు కమల ఉత్సవం, 14న రాత్రి 8 గంటలకు సింహవాహనం, 15న రాత్రి 8గంటలకు హంసవాహనం, 16న రాత్రి 8గంటలకు జింక వాహనం, 17న ఉదయం 9గంటలకు గిన్నెభిక్ష, రాత్రి 8గంటలకు గంధర్వ వాహనం, 18న సాయంత్రం 6గంటలకు శ్రీ సీతారామ కల్యాణం, రాత్రి 9గంటలకు గజవాహనం, 19న ఉదయం 8.30గంటలకు రథోత్సవం, 20 న రాత్రి 8 గంటలకు అశ్వవాహనం, 21న ఉదయం 8గంటలకు ధ్వజావరోహణం, 11గంటలకు వసంతోత్సవం, రాత్రి 8గంటలకు యాళీ వాహనం, 22 న రాత్రి 8 గంటలకు ఊంజల్ సేవ, 23న రాత్రి 10గంటలకు దవనోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

### బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో...

# ఉగాది సంబరాలు



స్వరార్చన చేస్తున్న నెల్లూరు స్వరాలయం మెలొడీస్



బ్రాహ్మణ భవనంలో చెట్లునాటి ట్రీగార్డ్స్ ఏర్పాటుచేస్తున్న డాక్టర్ సి.రోహిణి

ఉగాది పండుగ సందర్భంగా ఈనెల 6న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. బ్రాహ్మణ భవనం (డాక్టర్ సిఆర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్)లో జరిగిన ఈ వేడుకల్లో నెల్లూరు స్వరాలయం మెలొడీస్ గుండ్లుపూడి శ్రీనివాసకుమార్ బృందం వారిచే మధురమైన తెలుగుపాటల స్వరార్చన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గూడూరు బ్రాహ్మణ సోదర, సోదరీమణులు, గూడూరు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం గూడూరు మహిళామండలి మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి ఆధ్వర్యంలో బ్రాహ్మణ భవనం ప్రాంగణంలో చెట్లు నాటి సుమారు 30వేల రూపాయల వ్యయంతో ట్రీగార్డ్స్‌ను అమర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ ఈ బ్రాహ్మణ భవన్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, అధ్యక్షులు యరగడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, సభ్యులు పిఎస్ రాజ్యలక్ష్మి, పి.పురుషోత్తమరావు, దూబగుంట శ్రీనివాసరావు, గుంటూరు సుబ్రహ్మణ్యం, మహిళా అధ్యక్షురాలు కడివేటి పద్మజ, ఆంధ్ర మహిళా మండలి సభ్యులు విష్ణువందన, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు, వృక్షసంరక్షకుడు మద్దాలి శ్యాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### గూడూరులో ఓటింగ్



ఓటు హక్కు వినియోగించుకున్న గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, శివకుమార్‌రెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్న స్వతంత్ర అభ్యర్థి అరవ పార్వతయ్య



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు

### మాజీమంత్రి రాజ్యలక్ష్మి సోదరుని

# మృతికి సంతాపం

రాష్ట్ర మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి సోదరుడు మేడా వెంకురెడ్డి(74) అనారోగ్యంతో ఈనెల 8న వాకాడులోని నేదురుమల్లి నివాసంలో మృతిచెందడంతో సన్నిహితులు, పలువురు నాయకులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి తమ సంతాపం తెలియజేశారు. మేడా వెంకురెడ్డి గతంలో చిల్లకూరు మండలంలోని కడివేడు గ్రామ సహకార సంఘం అధ్యక్షునిగా ఎంతో కాలం పనిచేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

### గూడూరు ప్రభుత్వాసుపత్రిలో

# గర్భిణులకు భోజనాలు



డాక్టర్ రోహిణి చేతుల మీదుగా గర్భిణులకు భోజనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గూడూరులోని జెవివి ఆధ్వర్యంలో, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి దాతృత్వంతో సుమారు 200 మంది గర్భిణులకు భోజనాలు పెట్టారు. గూడూరు ప్రభుత్వాసుపత్రిలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ జెవివి కార్యక్రమాలు సేవాభావంతో ఉంటాయని, వారి ఆధ్వర్యంలో తమ క్లబ్‌ద్వారా గర్భిణులకు భోజనాలు చేయడం తమకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. గర్భిణులు ఈ ఎండాకాలంలో జాగ్రత్తగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, అశోక్, విష్ణు, ఎంచునారాయణ, రామ్మోహన్, చంద్ర, జీవని, డాక్టర్ ఉమ తదితరులతో పాటు ఆంధ్రమహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రతిభను వెలికి తీసేందుకు...

# సదస్సులు దోహదం చేస్తాయి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు సంబంధించిన విద్యా అంశాలపై ఏర్పాటుచేసే సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు అన్నారు. ఈ నెల 9న కళాశాలలోని ఎంబిఏ విభాగం ఆధ్వర్యంలో నెబులా-2కె 19 జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి సదస్సుల ఉపయోగాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, ప్రసాద్, జెఎన్ శాస్త్రి, రత్నదీప్, రవిప్రసాద్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్రాలకు చేరిన ఈవిఎంలు

- భవిష్యత్ తేల్చే మిషన్‌లకు భారీభద్రత

పోలింగ్ ముగిసింది. ఇక కౌంటింగ్ మిగిలింది. నెల్లూరు, తిరుపతి పార్లమెంట్‌ల పరిధిలోని అసెంబ్లీ, లోక్‌సభ ఈవిఎంలను అత్యంత బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రాలకు చేర్చారు. నెల్లూరు లోక్‌సభ పరిధిలోని నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవిఎంలను నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లలో, అలాగే తిరుపతి లోక్‌సభ పరిధిలోని తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఈవిఎంలను నెల్లూరురూరల్ కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. ఈ రెండు కేంద్రాల వద్ద భారీబందోబస్తు ఏర్పాటు చేశారు.

# పేటలో చేతులెత్తేసిన తెలుగుదేశం

జిల్లాలో 10 అసెంబ్లీలుంటే 9 నియోజకవర్గాలలో గెలుపోటముల మీద ఇరు పార్టీల అభ్యర్థులు ఎవరి ధీమాలో వాళ్ళున్నారు. గెలుపుపై వారి లెక్కలు వాళ్లేసుకుంటున్నారు. కాని, ఒక్క సూళ్ళూరుపేట నియోజకవర్గంలో మాత్రం పోలింగ్ రోజునే తెలుగుదేశం నాయకులు చేతులెత్తేయడం విచిత్రం. ఓ పక్క పోలింగ్ జరుగుతుండగా ఇంకోపక్క ఆ పార్టీ అభ్యర్థి పరసా రత్నం నియోజకవర్గాన్ని చేజేతులా పోగొట్టుకున్నామని కార్యకర్తలతోనే చెప్పడం ఆశ్చర్యం కలిగించే విషయం. నియోజకవర్గంలోని చాలా పోలింగ్ కేంద్రాల్లో తెలుగుదేశానికి కనీసం ఏజంట్లు లేరు. వార్ వన్‌సైడే అన్నట్లుగా ఏకపక్ష ఓటింగ్ జరిగింది.

# నియోజకవర్గాల వారీగా ఓట్ల పోలింగ్

ఈ నెల 11వ తేదీ జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గత ఎన్నికల్లో ఎప్పుడూ చూడని విధంగా ఓటర్లు పోటెత్తినట్లు వచ్చారు. గ్రామాల్లో అయితే సంక్రాంతి పండుగ, జాతర్లు జరిగే వాతావరణం కనిపించింది. గురువారం రాత్రి 8గంటల వరకు జరిగిన పోలింగ్ వివరాలు ఇలా ఉన్నాయి. పూర్తివివరాలు ఇంకా రావాల్సివుంది.

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| కావలి | 2,55,371 | 1,91,860 | 75.13 |
| ఆత్మకూరు | 2,08,990 | 1,36,366 | 65.25 |
| కోవూరు | 2,64,629 | 1,80,927 | 68.37 |
| నెల్లూరు సిటి | 2,38,794 | 1,40,888 | 59.00 |
| నెల్లూరు రూరల్ | 2,54,585 | 1,50,231 | 59.10 |
| సర్వేపల్లి | 2,30,417 | 1,57,467 | 68.34 |
| గూడూరు | 2,36,496 | 1,70,301 | 72.01 |
| సూళ్ళూరుపేట | 2,31,638 | 1,88,739 | 81.48 |
| వెంకటగిరి | 2,40,253 | 1,64,717 | 68.56 |
| ఉదయగిరి | 2,31,037 | 1,71,014 | 74.02 |
| మొత్తం | 23,92,210 | 16,52,510 | 69.08 |

## కాలధర్మం

## దొడ్ల కౌసల్యమ్మ



రాష్ట్రంలోనే మహిళా కళాశాలగా ప్రత్యేక గుర్తింపు వున్న నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాల వ్యవస్థాపకురాలు, ప్రముఖ దాత దొడ్ల కౌసల్యమ్మ ఈ నెల 7వ తేదీన స్వర్గస్తురాలైనారు. ఆమె వయస్సు 93 సంవత్సరాలు. నెల్లూరుజిల్లాలో సంపన్నులుగానే కాదు, దానధర్మాలలోనూ గొప్ప పేరున్న సర్దార్ పేపర్ మిల్లు అధినేత దొడ్ల సుబ్బారెడ్డి సతీమణే కౌసల్యమ్మ. నెల్లూరుజిల్లాలో దొడ్ల కుటుంబం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఆ కాలంలోనే మహిళలను విద్యావంతులను చేయాలనే ముందుచూపుతో ప్రత్యేకంగా మహిళా కళాశాలను ఏర్పాటు చేయడం దొడ్ల కుటుంబం యొక్క దార్శనికతకు నిదర్శనం. ఈ కళాశాల నుండే లక్షలాది మంది విద్యార్థినులు విద్యావంతులై మంచి స్థానాలలో వున్నారు.

డికెడబ్ల్యు కళాశాల వ్యవస్థాపకురాలు కౌసల్యమ్మ మృతి పట్ల ఆ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కళాశాలలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మహిళా విద్యాదాత దొడ్ల కౌసల్యమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# మొండికేసిన ఈవిఎంలు

*ప్రపంచంలో మనకంటే అగ్ర రాజ్యాలుగా వున్న అమెరికా, రష్యా, ఇంగ్లాండ్, జర్మనీ, జపాన్‌లలోనూ ఎన్నికలలో బ్యాలెట్‌నే వాడుతుంటారు. ఇవన్నీ టెక్నాలజీ పరంగా మనకంటే ముందున్న దేశాలే! అయితే అవేవీ మన దేశంలోలాగా ఎన్నికల కోసం ఈవిఎంలను వాడడం లేదు. కాని, ఈ విషయంలో మన కేంద్ర ఎన్నికల కమిషన్‌ను అభినందించాలి. దాదాపు 15ఏళ్ళ క్రితమే ఎన్నికల నిర్వహణ కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టారు.*




ఈవిఎంల ద్వారా ఎన్నికల నిర్వహణను సులభతరం చేశారు. ఈవిఎంలు వచ్చాకే ఎన్నికల హింస చాలావరకు తగ్గింది. రిగ్గింగ్‌లు లేవు, బ్యాలెట్ పేపర్లు చించడం లేవు, బ్యాలెట్ బాక్సుల్లో నీళ్ళు పోయడాలు లేవు, బ్యాలెట్ పేపర్లు లెక్కించేటప్పుడు గొడవలు లేవు, బ్యాలెట్ పత్రాల గోల్‌మాల్‌లు లేవు.

అయితే ఈవిఎంలలో వున్న లోపమల్లా అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు ఏర్పడి మొరాయించడం. ఈ ఎన్నికల్లోనూ ఆ సమస్య ఏర్పడింది. నెల్లూరుజిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈవిఎంలు పెద్దసంఖ్యలోనే మొరాయించాయి. ఈసారి ఈవిఎంలకు ఓటర్లు తమ ఓటు ఖచ్చితంగా ఎవరికి పడిందో తెలుసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన వివిప్యాట్‌లకు అనుసంధానం చేయడంతో కొన్ని సాంకేతిక సమస్యలొచ్చాయి. ఉదయం 7గంటలకే పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులుతీరారు. చాలాచోట్ల ఈవిఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అయినా ఓటర్లు ఓపికగా క్యూలలో నిల్చున్నారు. అయితే మొండికేసిన ఈవిఎంల స్థానాలలో అప్పటికప్పుడు ఎన్నికల అధికారులు కొత్త ఈవిఎంలను ఏర్పాటు చేసి పోలింగ్ మొదలుపెట్టించారు. కొన్ని చోట్ల గంట, రెండు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అయినా కూడా రాత్రి 8గంటల వరకు కూడా జనం క్యూలలో నిలబడి ఓట్లు వేయడం పెద్ద విశేషం.

# ధర్మబద్ధంగా జీవితం గడపాలి

అందరూ ధర్మబద్ధంగా జీవితం గడపాలని, ఆదర్శనీయమైన మార్గంలో పయనించాలని ఆధ్యాత్మిక ఉపన్యాసకురాలు డాక్టర్ గిరిజాలక్ష్మి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 7న నెల్లూరులోని సరస్వతి సమాజంలో ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ శ్రీ ఆదిశంకరాచార్యులవారు రచించిన 'ప్రశ్నోత్తర రత్నమాలిక' గురించి వివరించారు. ప్రపంచాన్ని ధర్మబద్ధమైన మార్గంలో నడిపేందుకు శంకరాచార్యులవారు ఈ బృహత్తరమైన రచన చేశారన్నారు. రత్నమాలికలోని అంశాలను సాధన చేయడం ద్వారా మేధస్సును పెంపొందించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమానికి యడవల్లి వెంకటేశ్వర్లు, మధుమతి సభాపోషకులుగా ఉండి డాక్టర్ గిరిజాలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య, విఆర్‌సి విశ్రాంత ఆచార్యులు ఎన్.రామచంద్రారెడ్డి సరస్వతి సమాజం అధ్యక్షుడు వి.రామ్మోహన్, కార్యదర్శి టి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కంపవాతం వ్యాధిపట్ల అప్రమత్తత అవసరం

**డాక్టర్ బిందుమీనన్**



పార్కిన్‌సన్స్ డేలో పాల్గొన్నవారిని సన్మానించిన హాస్పిటల్ నిర్వాహకులు

నరాలకు సంబంధించిన కంపవాతం (పార్కిన్‌సన్స్) వ్యాధి పట్ల వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ అన్నారు. వరల్డ్ పార్కిన్‌సన్స్ డిసీజ్ డేను పురస్కరించుకుని ఈనెల 6న నెల్లూరులోని రామ్మూర్తినగర్‌లో ఉన్న యాక్సాన్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఈ వ్యాధి కేవలం మందులతో తగ్గిపోదని, వ్యాధిగ్రస్తులు మందులతో పాటు, వైద్యులు సూచించిన థెరపీలు కూడా చేయించుకోవాలని సూచించారు. ఇందుకోసం గత ఏడాది నుంచి ఉచిత థెరపీ చికిత్సలను ప్రారంభించామని, చికిత్సా తరగతులను ప్రతి శనివారం తమ ఆసుపత్రిలో నిర్వహించ నున్నామని తెలిపారు. వ్యాధిగ్రస్తులు ఈ ఉచిత చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు వ్యాధిగ్రస్తులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియో థెరపిస్ట్ శాలిని, స్పీచ్ థెరపిస్ట్, సైకాలజిస్ట్ సురేష్, దీప తదితరులు పాల్గొన్నారు.

# సింహవాహనంపై ఊరేగిన సంగమేశ్వరుడు

మండల కేంద్రమైన సంగంలో పెన్నా నదీతీరంలో కొలువై ఉన్న కామాక్షీదేవి సమేత శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 9వతేదీ రాత్రి ఎంతో వైభవంగా స్వామివార్లకు సింహవాహనోత్సవం నిర్వహించారు. సంగమేశ్వరస్వామిని, కామాక్షీదేవి అమ్మవారిని భారీ గజమాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం, మంగళవాయిద్యాల మధ్య, వేదమంత్రాల మధ్య స్వామివార్లకు ఈ వాహనోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లకు టెంకాయలు, కర్పూరహారతులు సమర్పించుకున్నారు.

# గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశానికి గడువు పెంపు

2019–2020 విద్యా సంవత్సరానికి సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు గడువు ఈ నెల 18వతేదీ వరకు పొడిగించినట్లు గురుకులాల కో–ఆర్డినేటర్ యానాది తెలిపారు. పదవ తరగతి హాల్ టిక్కెట్, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన వారు ఫలితాలతో సంబంధం లేకుండా సొంత జిల్లాల వారు మాత్రమే దరఖాస్తు చేయాలని, ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

# ఎంజిబి మాల్‌లో వికారి వేడుకలు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 6న నెల్లూరులోని ఎంజిబి షాపింగ్ మాల్‌లో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ ఎం.డి గంగాధర్ మాట్లాడుతూ ఉగాది విశిష్టతను వివరించారు. మన సంప్రదాయాలను మనం గౌరవించుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట సునీల్‌కుమార్ ఉగాది పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. అనంతరం నటరాజ కళాక్షేత్రం అకాడమీ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# మళ్ళీ మోడీ మానియా పని చేస్తుందా?

## ప్రజలు నిప్పు వైపా? పప్పు వైపా??



***దేశ వ్యాప్తంగా ఎన్నికల సమరం మొదలైంది. ఏప్రిల్ 11వ తేదీన 91లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ముగియడంతో తొలి అంకం ముగిసినట్లయ్యింది. ఇక ఆరు దశల పోలింగ్ మిగిలివుంది. దేశంలో ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో పూర్తి మెజార్టీతో ఒక పార్టీ అధికారంలోకి రావడం కష్టం. మరి కూటమికైనా అలాంటి అవకాశం వుందా?***

ఒకసారి 2014 ఎన్నికలను పరిశీలిస్తే దేశమంతటా నరేంద్ర మోడీ ప్రభంజనం పని చేసింది. దీనికితోడు యూపిఏ రెండో విడత పరిపాలనలో అవినీతి కుంభ కోణాలు మోతెక్కిపోయాయి. ఉగ్రవాద చర్యలు పెచ్చు మీరాయి. ఆర్ధికవేత్తగా పేరుగాంచిన మన్మోహన్‌సింగ్ పరిపాలనలో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ప్రజలు యూపిఏ ప్రభుత్వాన్ని పెద్ద దరిద్రంగా భావించారు. 2014 ఎన్నికల్లో ఓటు ద్వారా కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పారు. కనీసం లోక్‌సభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు.

2014లో మోడీ హవా... యూపిఏ ప్రభుత్వంపై వ్యతిరేకత... ఎన్డీఏకు 334 సీట్లను కట్టబెట్టింది. కూటమిలోని బీజేపీయే 283సీట్లతో మెజార్టీ మార్క్‌ను దాటింది.

మరి అలాంటి మోడీ హవా మరోసారి దేశంలో రానుందా?! దేశ ప్రజలు రెండోసారి కూడా మోడీకే పట్టం కట్టనున్నారా? ఈ అంశాలపై లోతుగా చర్చిస్తే కాంగ్రెస్‌పై ప్రజలకు గతంలో వున్నంత వ్యతిరేకత ఇప్పుడు ఉండకపోవచ్చు. అలాగే మోడీపై గతంలో వున్నంత అభిమానం ఇప్పుడు ఉండకపోవచ్చు. కాని, కాంగ్రెస్‌ను మళ్ళీ నెత్తిన పెట్టుకునేంత సాహసం చేసే స్థితిలో మాత్రం దేశ ప్రజలు లేరు. కాంగ్రెస్ వల్ల ఈ దేశం అభివృద్ధి చెందడం కంటే కూడా అవస్థల పాలైందని ఎక్కువగా నమ్ముతున్నారు. ఈ దేశంలో శాశ్వతంగా పాతుకుపోయిన సకల సమస్యలకు గత కాంగ్రెస్ పాలకులే కారణంగా భావిస్తున్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు, తాత్కాలిక తాయిలాల విధానాలు ప్రజలకు రుచించడం లేదు.

కాంగ్రెస్ మీద ప్రజలకు ఇంతగా విరక్తి పెరగడానికి కారణం ప్రధాని నరేంద్ర మోడీనే! తన ఐదేళ్ళ పాలనలో ఆయన భారతదేశాన్ని ప్రపంచ దేశాల ముందు ఎంతో గొప్పదిగా చూపించాడు. దేశ ప్రతిష్టను ఇనుమడింపజేశాడు. అనేక అంశాలలో భారత్‌ను అగ్రరాజ్యాల పక్కన నిలబెట్టాడు. ప్రపంచానికి భారత్‌ను విశ్వగురుగా మలిచే ప్రయత్నంలో అలుపెరుగని కృషి చేశాడు. రాయి శిల్పం కావాలంటే ఉలి దెబ్బలు తట్టుకోక తప్పదని చెప్పిన మోడీ నోట్ల రద్దు ద్వారా దేశ ప్రజలకు కొంచెం నొప్పినైతే కలిగించాడు. నోట్ల రద్దు అన్నది ఎంతో పకడ్బందీగా అమలు చేయాలి. ఆర్థిక నిపుణుల పర్యవేక్షణలో జరగాలి. కాని, ముందుచూపు లేకుండా మోడీ చేసిన నోట్ల రద్దు ప్రజలకు అష్టకష్టాలు చూపించింది. అలాగే ఎన్డీఏ వ్యూహాత్మకంగా అమలులోకి తెచ్చిన జిఎస్టీపై మొదట వ్యతిరేకత వచ్చినా కాలక్రమంలో అన్నీ సర్దుకున్నాయి.

దేశ ప్రజలకు బీజేపీ ఏదైతే వాగ్దానం చేసిందో అవినీతికి తావులేని పరిపాలనను అందించడంలో మోడీ సక్సెస్ అయ్యాడు. ఈ ఐదేళ్లలో ఒక్క కుంభకోణం లేదు, ఒక్క కేంద్రమంత్రిపై కూడా అవినీతి ఆరోపణలు లేవు. అందరూ నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే కేంద్రమంత్రులే! వాళ్ళు తమ తమ శాఖల ద్వారా ఎంతో ప్రగతిని చూపించారు. ముఖ్యంగా రైల్వేలో అనూహ్య ప్రగతి సాధించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పాదన పెంచారు. కరెంట్ లేని గ్రామాలనేవే ఇప్పుడు దేశంలో లేవు. ఎయిర్‌పోర్టులు, సీపోర్టులు, రహదారుల అభివృద్ధిలో విశేష ప్రగతి వుంది. దేశంలో ఒక ఆర్థిక క్రమశిక్షణ ఏర్పాటు చేశారు. పన్నులు ఎందుకు కట్టాలి అనే స్థాయి నుండి దేశం కోసం పన్నులు కట్టాలి అనే స్థాయిలో ప్రజలకు అవగాహన వచ్చేలా చేశారు.

అయితే ప్రపంచంలోని అన్ని దేశాలతో మోడీ నెరపిన దౌత్య సంబంధాలు ఆయన పరిపాలనలో చెప్పుకోదగిన ముఖ్యఅంశం. ఆఖరకు అరబ్ దేశాలు కూడా మోడీ నాయకత్వాన్ని సమర్థించాయి. అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో అన్ని దేశాలు కూడా భారత్‌కు మద్దతుగా నిలిచాయి. రక్షణ రంగంలో, అంతరిక్ష రంగంలో ఈ అయిదేళ్ళలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నో అనితర విజయాలనే సాధించింది. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో కఠిన వైఖరినే అవలంభించింది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడులకు సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ వంటి వాటి ద్వారా చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెప్పింది. అదే సమయంలో దేశంలోని బడుగు, బలహీన రైతుల బాగు కోసం పలు పథకాల ద్వారా చేయూతనందిస్తూ సంక్షేమానికి కూడా ప్రాధాన్యతనిస్తుంది.

నాకు రెండోసారి అవకాశం ఇవ్వండని ప్రజల ముందుకు పోయి ఓటడగడానికి మోడీకి ఎన్నో అర్హతలున్నాయి. కాంగ్రెస్సే ఓట్లడిగే హక్కును కోల్పోయింది. అయినా కూడా రాహుల్ ప్రధాని అభ్యర్థిగా మళ్ళీ కాంగ్రెస్ ప్రజల ముందుకొచ్చింది. గతంలో వచ్చిన 44సీట్లు రెట్టింపు కావొచ్చేమో గాని, ఆ పార్టీ లేదా యూపిఏ కూటమికి మళ్ళీ అధికార పీఠం అప్పగించేంత సాహసం భారత ప్రజలు చేయలేకపోవచ్చు!?

# ఇదే పాట.. ప్రతీ చోట!...

- 'రావాలి జగన్.. కావాలి జగన్.. మన జగన్'... పాట అదరహో!..
- నెలరోజుల్లోనే 2.21 కోట్ల మంది వీక్షకులు




**"రావాలి జగన్.. కావాలి జగన్... మన జగన్".. ఎక్కడ విన్నా.. ఎక్కడ చూసినా.. ఇదే పాట. ప్రతీచోట ఈ పాటే వినిపిస్తోంది.. సామాజిక మాధ్యమాల్లో ఈ పాటే కనిపిస్తోంది. నెట్‌లోనూ ఈ పాటే హల్‌చల్ చేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోనూ.. మారుమూల గ్రామాల్లో కూడా ఈ పాటే మార్మోగిపోతోంది.** 'రావాలి జగన్–కావాలి జగన్' అంటూ పల్లెల్లో, పట్టణాల్లోని జనం ఆ పాట వింటూ ఎంతో ఆనందిస్తున్నారు. ఏ నలుగురు ఏ కూడలిలో నిలిచినా కూడా ఈ పాటే పెట్టుకుని అందరూ వింటున్నారు. ఇక పార్టీ నాయకులకు, కార్యకర్తల విషయం చెప్పనే అక్కరలేదు.. వారికి ఈ పాట ఎంతో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని ఇస్తోంది. తమ ప్రచారాల్లో భాగంగా ముందుగా ఈ పాటనే అందరికీ వినిపిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే, పార్టీల ప్రచారగీతాల ప్రస్థానంలోనే... ఈ పాటకు ఉన్నంత ఆదరణ మరే పాటకూ రాలేదంటే అతిశయోక్తి కానే కాదు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఈ ప్రచార గీతం సామాజిక మాధ్యమాల్లో అదరగొట్టేస్తోంది. అందులోనూ కొద్దిరోజుల్లోనే ఈ పాటకు ఇంత ఆదరణ రావడం అపూర్వం. మార్చి 11వతేదీన విడుదలైన ఈ పాటను కేవలం నెలరోజుల్లోనే 2.21 కోట్లమంది వీక్షించారంటే ఈ పాట ఎంతగా ప్రజల్ని ఆకట్టుకుంటోందో తేటతెల్లమవుతుంది. ఒక రాజకీయపార్టీ రూపొందించిన పార్టీ ఎన్నికల ప్రచారగీతాన్ని ఇంతమంది చూడడం.. కోట్లాది మంది వినడం ఇదే ప్రథమం కూడా.

'ఐ–ప్యాక్' బృందం రూపొందించిన ఈ పాట విడుదలైన కేవలం 20 రోజులకే కోటిమంది హృదయాలను తాకిందంటే ఎంతైనా అద్భుతమే మరి!.. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న జగన్ అభిమానులందరూ ఈ పాట పట్ల ఎంతగానో ఆకర్షితులవుతున్నారు. యువతీ యువకులైతే ఈ పాటను తమ ఫోన్లకు రింగ్‌టోన్‌గా కూడా ఏర్పాటు చేసుకుని మురిసిపోతున్నారు. ఒక ప్రాంతీయపార్టీ ప్రచారగీతం ఇంతగా జనాదరణ పొందడం.. రానున్న మార్పుకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఓటే... మన ఆయుధం..!



ఓటే మన ఆయుధం... ఓటుతోనే అభివృద్ధికి మార్గం అని చాటిచెప్తూ... 11వ తేదీ నెల్లూరులో తమ ఓటు హక్కును వినియోగించుకున్న నెల్లూరుజిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు దంపతులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com